



Truth of News

PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 12 | బుధవారం 05 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi





## చాందీపుర వైరస్ కలకలం

2 లో

- గుజరాత్‌లో 22 మంది చిన్నారులు మృతి

# చందా చోర్ గద్దీ చోడ్

- పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీల నిరసన
- ప్రియాంక గాంధీ సహా పలువురు ప్లకార్డుల ప్రదర్శన



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

అయోధ్యలోని రామ మందిర విరాళాల కుంభకోణం, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురాగతాలకు నిరసనగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాతో సహా ప్రతిపక్ష ఎంపీలు మంగళవారం పార్లమెంటు మకర ద్వారం ముందు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకం గా ప్లకార్డులు ప్రదర్శించారు. 'ఛందా చోర్, గద్దీ చోర్', 'అమిత్ షా జవాబ్ దో' వంటి నినాదాలు చేశారు. రామ మందిరంలో విరాళాల దొంగతనం జరిగిందన్న ఆరోపణలకు ప్రతీకగా ఎంపీలు ఆ ప్రదేశంలో విరాళాల పెట్టెలను ఉంచి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వాటి చుట్టూ బారులు తీరారు. అందిన విరాళాలకు, ఆ తర్వాత జరిగిన 'దొంగతనానికి' ప్రతీకగా కొందరు ఎంపీలు ఆ పెట్టెలో నగదు కూడా వేశారు. ప్రియాంక గాంధీతో పాటు, ఎస్పీకి చెందిన డింపుల్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, టీఎంసీకి చెందిన సాగరిక ఘోష్, ఆర్జేడీకి చెందిన సంజయ్ యాదవ్, మనోజ్ ఝా, ఆర్ఎస్పీకి చెందిన ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. 'అమిత్ షా పార్లమెంటుకు ఎందుకు రాలేదు?' అని రాసి ఉన్న బ్యానర్‌తో ఎంపీలు నిరసన తెలిపారు. హోం మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రామమందిర విరాళాల సేకరణలో చోటుచేసుకున్నట్టు ఆరోపించబడుత... త

- మిగతా 2లో..




## సుప్రీంకోర్టుకు నీట్ అభ్యర్థులు

- ఓఎంఆర్ షీట్స్‌లోని సమాధానాల్లో తేడాలున్నాయంటూ పిటిషన్

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఓఎంఆర్ షీట్స్‌లో అసమానతలు ఉన్నాయంటూ ఆరుగురు నీట్ యూజీ అభ్యర్థులు మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పరీక్ష సమయంలో ఓఎంఆర్ షీట్స్‌లో వారు మార్క్ చేసిన సమాధానాలకు, నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టీఏ) అప్‌లోడ్ చేసిన కాపీల్లోని సమాధానాల్లో తేడాలు ఉన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రకటనకు ముందే విచారించాలని కోరడంతో..

- మిగతా 2లో..



# యువత, మైనారిటీలకు పెద్దపీట

- మంత్రివర్గంలో కొత్తగా 20 మంది ఎమ్మెల్యేలకు అవకాశం
- యువతతో పాటు మైనార్టీలకు పెద్దపీట వేసిన కాంగ్రెస్
- కర్ణాటకలో క్యాబినెట్ విస్తరించిన ముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు - సూర్య వాస్తవం

కర్ణాటకలో ఎట్టకేలకు క్యాబినెట్ విస్తరణ చేపట్టారు. సిద్ధరామయ్య స్థానంలో ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ జూన్ 3న ప్రమాణం చేయగా.. ఆయనతో పాటు మరో 13 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి రెండు నెలలుగా మంత్రివర్గ విస్తరణపై చర్చ జరుగుతోంది. తాజాగా, విస్తరణ చేపట్టి.. మొత్తం 20 మందికి అవకాశం కల్పించారు. పార్టీ అధిష్ఠానం సూచనలు, కాంగ్రెస్ అగ్రనేతల మధ్య జరిగిన చర్చల అనంతరం జాబితాను ఖరారు చేశారు. క్యాబినెట్ విస్తరణతో పాటు శాసనసభ, శాసన మండలిలోని కొన్ని ముఖ్యమైన రాజ్యాంగ పదవుల భర్తీకి కూడా అధిష్ఠానం ఆమోదం వేసింది. వాస్తవానికి జులై 31నే క్యాబినెట్ విస్తరణ జరగాల్సి ఉండగా.. కాంగ్రెస్ అగ్రనేతల చర్చల కారణంగా వాయిదా పడింది.

- మిగతా 2లో..



## డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్టు.. విడుదల

- సీఎం విజయ్, సినీనటి త్రిషను ఉద్దేశిస్తూ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై కేసు

చెన్నై - సూర్య వాస్తవం

డీఎంకే కీలక నేత, తమిళనాడు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్టయ్యారు. అనంతరం విడుదలయ్యారు. సీఎం విజయ్, సినీనటి త్రిషను ఉద్దేశిస్తూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కేసులో పోలీసులు ఆయనను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణ కోసం పోలీస్ స్టేషన్?కు తరలించారు. దీంతో స్టాలిన్ నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అరెస్ట్‌ను నిరసిస్తూ పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా డీఎంకే కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, డీఎంకే శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. డీఎంకే కార్యకర్తలను చెదరగొట్టి పోలీసులు ఆయనను తరలించారు. అనంతరం ఈ కేసులో ఆయనకు

- మిగతా 2లో..

## 'అమరజీవి జలధార'

- గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: పవన్ కల్యాణ్
- జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు
- తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం
- నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్

2 లో

## అగాధం నుంచి అభివృద్ధి వైపు..



- ఏపీ ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు ప్రోగ్రెస్ రిపోర్ట్
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం చంద్రబాబు వివరణ
- గత రెండేళ్లలో సంక్షేమానికి రూ.1.49 లక్షల కోట్లు, అభివృద్ధికి రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు
- గత ప్రభుత్వ పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు చర్యలు
- రుణాల రీ-షెడ్యూల్ ద్వారా ప్రభుత్వానికి రూ.8,269 కోట్ల మేర ఆదా
- వైసీపీ పాలనలో రాష్ట్రం రూ.6.94 లక్షల కోట్ల జీఎస్డీపీ నష్టపోయిందని వెల్లడి

అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసం నుంచి ప్రగతి పథం వైపు నడిపిస్తున్నామని, గత రెండేళ్లలో తీసుకున్న పటిష్ట చర్యలతో రాష్ట్రం అగాధం నుంచి అభివృద్ధి వైపు ప్రయాణిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి,

- మిగతా 2లో..

## పారదర్శకంగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

- పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్ - సూర్య వాస్తవం



పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## సంపాదకీయం




# మారుతున్న రాజకీయాలు

ఒకప్పుడు రాజకీయాల్లో ప్రజల మనసు గెలవాలంటే పాదయాత్రే ప్రధాన ఆయుధంగా ఉండేది. వేల కిలోమీటర్లు నడిచి ప్రజల సమస్యలు తెలుసుకోవడం ద్వారా నాయకులు తమ రాజకీయ ప్రస్థానాన్ని బలోపేతం చేసుకునేవారు. కానీ కాలం మారుతోంది? రాజకీయ కమ్యూనికేషన్ కూడా మారుతోంది. ఇప్పుడు జాబ్ మేళాలు, మెడికల్ క్యాంపులు, మహిళా సమావేశాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువ కావడం వంటి కొత్త పద్ధతులు రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. మరి నిజంగానే పాదయాత్రల యుగానికి ప్రత్యామ్నాయం వచ్చిందా?తెలుగు రాష్ట్రాల్లో గత రెండు దశాబ్దాలుగా పాదయాత్రలు రాజకీయ విజయానికి కీలక వ్యూహంగా నిలిచాయి. 2003లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి చేపట్టిన పాదయాత్ర, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు నిర్వహించిన “వస్తున్నా మీ కోసం”, వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన “ప్రజా సంకల్ప యాత్ర” వంటి కార్యక్రమాలు రాజకీయంగా పెద్ద మైలురాళ్లుగా నిలిచాయి. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడానికి ఇవి సమర్థమైన వేదికలుగా మారాయి.అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సోషల్ మీడియా విస్తరణతో నాయకుడు ఒక గ్రామంలో చేసిన కార్యక్రమం క్షణాల్లోనే లక్షల మందికి చేరుతోంది. దీంతో ప్రజలను కలవడానికి పాదయాత్ర ఒక్కటే మార్గం కాదనే భావన బలపడుతోంది. ఇక ప్రజల అంచనాల్లో కూడా మార్పు కనిపిస్తోంది. “ఎంత నడిచారు?” అనే ప్రశ్న కంటే “ఏం చేశారు?” అనే ప్రశ్నకు ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ముఖ్యంగా యువత ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై నాయకుల చర్యలను గమనిస్తోంది. అందుకే రాజకీయ నాయకులు కూడా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నిరంతర ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.ఇటీవలి కాలంలో మెగా జాబ్ మేళాలు, ఉచిత వైద్య శిబిరాలు, మహిళా సంఘాలతో సమావేశాలు, రైతు అవగాహన సదస్సులు, స్కిల్ ట్రైనింగ్ క్యాంపులు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఇవి ఏ ఒక్క పార్టీకి మాత్రమే పరిమితం కాకుండా వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అమలు చేస్తున్న కార్యక్రమాలుగా మారుతున్నాయి.అదే సమయంలో ప్రచార విధానంలో కూడా గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు పోస్టర్లు, భారీ బహిరంగ సభలు ప్రధాన ప్రచార సాధనాలైతే, ఇప్పుడు రీల్స్, షార్ట్ వీడియోలు, లైవ్ స్ట్రీమింగ్, డిజిటల్ కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. స్థానిక స్థాయిలో చిన్న సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో నిరంతర సంబంధాన్ని కొనసాగించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. అయితే రాజకీయ విజయాన్ని ఒక్క అంశంతోనే ముడిపెట్టలేమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. పార్టీ బలం, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, ఎన్నికల సమయంలో నెలకొనే రాజకీయ వాతావరణం వంటి అనేక అంశాలు కలిసి ఫలితాలను ప్రభావితం చేస్తాయి.భారతదేశంలో డిజిటల్, సోషల్ మీడియా విస్తరణ నేపథ్యంలో, ప్రజా చర్చ మరియు ప్రజాభిప్రాయ స్వయంప్రతిపత్తి సవాలుకు గురయ్యాయి. భారతదేశపు 2019 సార్వత్రిక ఎన్నికలు, నిజమైన డిజిటల్ వినియోగ సమాజంలో జరిగిన మొట్టమొదటి జాతీయ ఎన్నికలు. ఈ ఎన్నికలలో, ఓటర్లలో సుమారు సగం మందికి డిజిటల్ మార్గాలు అందుబాటులో ఉండగా, మరో మూడో వంతు మందికి సోషల్ మీడియా అందుబాటులో ఉంది. ప్రపంచ పోకడకు అనుగుణంగా, భారతీయ రాజకీయ నాయకులు తమ మద్దతుదారులతో నేరుగా మమేకమవ్వడానికి, రోజువారీ రాజకీయ సంభాషణల కోసం సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. జిటల్ వేదికలపై కార్యకలాపాలను, అలాగే అవి విస్తృత రాజకీయ సమీకరణ నుండి ఏ విధంగా విడదీయరానివిగా ఉన్నాయో విశ్లేషిస్తుంది.ఔజూలోని దక్షిణాసియా అధ్యయనాల సంస్థ మరియు కొన్రాడ్ అడెనార్ స్టిఫ్టుంగ్ నిర్వహించిన ఒక వర్క్‌షాప్‌లో ఈ పత్రాల ముసాయిదా ప్రతులు సమర్పించబడ్డాయి.“ప్రధాన మీడియా స్రవంతిని బీజేపీ తన నియంత్రణలోకి తీసుకుంది” అని కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం హెడ్ సుప్రియా శ్రీనేత్ అన్నారు.మా నిధులను స్తంభింపచేశారు. ప్రకటనలపై ఖర్చు పెట్టేందుకు మా దగ్గర డబ్బులు లేవు” అని ఆమె అన్నారు. ఎన్నికలకు ముందుగా ఆదాయపు పన్ను విభాగం తీసుకున్న చర్యల గురించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం రాజకీయ ప్రతీకారం తీర్చుకుంటోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే, దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయని, దీనిలో తమ పాత్రేమీలేదని ప్రభుత్వం అంటోంది.“ఇలాంటి ఇబ్బందుల నడుమ ఓటర్లను చేరుకునేందుకు ఇన్‌ఫ్లూయెన్సర్లు వారధిలా పనిచేస్తున్నారు. మా పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసం ఉండేవారితోపాటు మా వర్క్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయాలనుకునేవారితో మేం కలిసి పనిచేస్తున్నాం” అని ఆమె చెప్పారు.సోషల్ మీడియాను ప్రజాస్వామ్యీకరించడంలో ఇన్‌ఫ్లూయెన్సర్లు సాయం చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మాజీ పొలిటికల్ అడ్వైజర్ అంకిత్ లాల్ అన్నారు.ద దేశ్‌భక్త్ యూట్యూబ్ చానెల్ నడిపే మాజీ జర్నలిస్టు ఆకాశ్ బెనర్జీ మాట్లాడుతూ ఇన్‌ఫ్లూయెన్సర్లు తమ హద్దులను చెరిపేసుకుంటూ ఒక్కో అడుగు ముందుకు వెళ్తున్నారని చెప్పారు.జర్మనీ నుంచి యూట్యూబ్ చానెల్ నడిపిస్తున్న ధ్రువ్ రాఠీ తాజాగా చేసిన ‘ఈజ్ ఇండియా బికమింగ్ ల డిక్టేటర్‌షిప్?’ వీడియోను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఆ వీడియోకు ఇప్పటివరకూ 24 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. దీనిపై ప్రభుత్వం స్పందించలేదు.‘ఆ వీడియో తర్వాత డిక్టేటర్‌షిప్ అనే పదంపై చాలా చర్చ కొనసాగింది. ఇలా జరగడం నేను ముందెన్నడూ చూడలేదు” అని బెనర్జీ అన్నారు.ఇన్‌ఫ్లూయెన్సర్స్‌గా మా పని కేవలం కిటికీ తెరిచి వర్షం పడుతుందో లేదో చూడటం మాత్రమే కాదు. నీలి మేఘాలు కమ్ముకుంటున్నప్పుడు, ఓటింగ్ ద్వారా మీరు వాటిని తొలగించొచ్చని ప్రజల్లో చైతన్యం కల్పించడం మా బాధ్యత” అని ఆయన చెప్పారు.2029 ఎన్నికల్లో మరోసారి భారీ పాదయాత్రలే ప్రధాన అస్త్రంగా మారతాయా? లేక జాబ్ మేళాలు, సేవా కార్యక్రమాలు, డిజిటల్ కమ్యూనికేషన్, ప్రజలతో నిరంతర అనుబంధమే కొత్త రాజకీయ ఫార్ములాగా నిలుస్తుందా? దీనికి సమాధానం భవిష్యత్తులోనే తేలనుంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది? ప్రజలతో అనుసంధానమయ్యే పద్ధతులు మారుతున్నాయి వాటికి అనుగుణంగా రాజకీయాలు కూడా కొత్త రూపాన్ని

# పరిశుభ్రతే ప్రజారోగ్యానికి పునాది

- డా.ముచ్చుకోట సురేష్ బాబు
- ప్రజారోగ్యానికి తొలిమెట్టు పరిశుభ్రమైన మరుగుదొడ్లు
- మహిళలు, బాలికలు, ప్రయాణికుల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం అవసరం
- మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు నిరంతర నిర్వహణకూ ప్రాధాన్యం ఇవ్వాలి




**అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం :** వ్యక్తిగత పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ --- ఈ మూడు ఒకదానితో ఒకటి విడదీయరాని అంశాలు. ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన మరుగుదొడ్లను అందుబాటులో ఉంచడం ప్రతి ప్రభుత్వపు ప్రాథమిక బాధ్యత. అయితే దేశంలోని అనేక పట్టణాలు, నగరాల్లో ప్రజా మరుగుదొడ్ల పరిస్థితి ఇప్పటికీ అత్యంత దయనీయంగా ఉంది. ఇది కేవలం ప్రజలకు కలిగే అసౌకర్యం మాత్రమే కాదు. ప్రజా రోగ్యానికి తీవ్రమైన ముప్పుగా కూడా మారుతోంది.ప్రయాణ సమయం లోనైనా, ఆహారపు అలవాట్లలో మార్పుల వల్లనైనా అకస్మాత్తుగా మరుగుదొడ్డి అవసరం ఏర్పడటం సహజం. కానీ కూరగాయలు, పండ్లు, చేపలు, మాంసం మార్కెట్లు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, వాణిజ్య సముదాయాలు, ప్రధాన రహదారుల వద్ద పరిశుభ్రమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉండటం చాలా అరుదుగా కనిపిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రైతులు, లారీ డ్రైవర్లు, హమాలీలు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సరైన మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో కొందరు దుకాణాల వెనుక, కాలనీల్లో, సెల్లార్లలో, ఖాళీ స్థలాల్లో మూత్ర, మల విసర్జన చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనివల్ల దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు, ఈగలు పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం అధికమవుతోంది. ఎక్కడైనా పబ్లిక్ టాయిలెట్ ఉన్నప్పటికీ, వాటి నిర్వహణ మాత్రం అనేక చోట్ల అత్యంత నిర్లక్ష్యంగా కనిపిస్తోంది. గోడలపై గుట్కా, పాన్ మరకలు, బీడీ, సిగరెట్ అవశేషాలు, పగిలిపోయిన తలుపులు, పనిచేయని ఫ్లష్‌లు, నీటి కొరత, తీవ్రమైన దుర్వాసన వంటి సమస్యలతో ప్రజలు వాటిని ఉపయోగించడానికి కూడా వెనుకంజ వేస్తున్నారు.

**మహిళలు, బాలికలపై అధిక ప్రభావం**

ఈ పరిస్థితుల్లో మహిళలు, బాలికలు అత్యధికంగా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో మరుగుదొడ్డి అందుబాటులో లేక సిగ్గు, అసౌకర్యంతో గంటల తరబడి అవసరాన్ని అణచుకోవాల్సి వస్తోంది. దీనివల్ల మూత్రనాళ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, మూత్రపిండాల సమస్యలు, ఇతర ఆరోగ్య ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. కొందరు మహిళలు బయటకు వెళ్లే ముందు నీరు తాగడానికే వెనుకాడుతున్న పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి.పాఠశాలల్లో మరుగుదొడ్ల కొరత ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని భారత సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, అనేక పాఠశాలల్లో ఇప్పటికీ తగిన సౌకర్యాలు లేవు. ఉన్న చోట్ల కూడా సరైన నిర్వహణ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బాలికలు నెలసరి సమయంలో ఎదుర్కొనే సమస్యలు వారి హాజరు, విద్యాభ్యాసంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఇది పాఠశాల విద్యను మధ్యలోనే నిలిపివేయడానికి కూడా కారణమవుతోంది.

**నిబంధనలు కాగితాలకే పరిమితమా**

మున్సిపల్ నిబంధనల ప్రకారం వాణిజ్య సముదాయాలు, కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో ప్రతి అంతస్తుకు తగిన మరుగుదొడ్లు ఉండాలి. కానీ అనేక భవనాల్లో ఈ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ యంత్రాంగం తగిన పర్యవేక్షణ చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేశంలోని అనేక నగరాలు ‘ఓడీఎఫ్ ప్లస్ ప్లస్’ గుర్తింపు పొందినా, క్షేత్రస్థాయి పరిస్థితులు కొన్ని ప్రాంతాల్లో అందుకు భిన్నంగా ఉన్నాయి. బహిరంగ మూత్ర విసర్జన ఇప్పటికీ కొనసాగుతున్న ప్రాంతాలు ఉన్నాయి. స్వచ్ఛ భారత్ సెస్ రూపంలో వేల కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నప్పటికీ, ఆ నిధులు ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణకు ఎంత మేర వినియోగిస్తున్నారనే అంశంపై మరింత పారదర్శకత అవసరం.

**పారిశుధ్య కార్మికులకు భద్రత అవసరం**

చాలా పబ్లిక్ టాయిలెట్ల వద్ద చెత్తకుండీలు ఏర్పాటు చేయడంతో అవి చిన్న డంపింగ్ యార్డుల్లా మారుతున్నాయి. పారిశుధ్య కార్మికులకు చేతి తొడుగులు, మాస్కులు, రక్షణ పరికరాలు, ఆధునిక శుభ్రపరిచే సాధనాలు, సబ్బు ద్రావణాలు, డిటర్జెంట్లు, ఫినాయిల్ వంటి కనీస సౌకర్యాలు కూడా అనేక చోట్ల అందడం లేదు.యాసిడ్, బ్లీచింగ్ పౌడర్ వంటి రసాయనాలను నిరంతరం ఉపయోగించడం వల్ల పారిశుధ్య కార్మికులు ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి వారికి అవసరమైన వ్యక్తిగత రక్షణ పరికరాలు, యాంత్రిక శుభ్రపరిచే సాధనాలు తప్పనిసరిగా అందించాలి.

**మూత్రశాలలకు రుసుము ఎందుకు?**

పట్టణాల్లోని కొన్ని పబ్లిక్ టాయిలెట్లలో మూత్రశాల వినియోగానికి రూ.3 నుంచి రూ.5 వరకు రుసుము వసూలు చేస్తున్నారు. సాధారణ మూత్ర విసర్జనకు కూడా రుసుము వసూలు చేయడం వల్ల కొందరు ప్రజలు వాటిని ఉపయోగించకుండా బహిరంగ ప్రదేశాలను ఆశ్రయిస్తున్నారు. దీనివల్ల పారిశుధ్య సమస్యతో పాటు ప్రజారోగ్య సమస్య కూడా మరింత తీవ్రమవుతోంది. సాంకేతికతతో సమర్థవంతమైన నిర్వహణ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా మరుగుదొడ్ల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వినియోగించడం అత్యవసరం. హైదరాబాద్‌కు చెందిన హార్ష్ రంజన్ గుప్తా రూపొందించిన కాంటాక్ట్‌లెస్ స్మార్ట్ టాయిలెట్ నమూనా ఈ దిశలో ఒక వినూత్న ప్రయత్నంగా చెప్పవచ్చు. తక్కువ నీటితో పనిచేసే ఫ్లష్ వ్యవస్థ, సెన్సార్ ఆధారిత ఆటోమేటిక్ వినియోగం, ఐఓటీ ఆధారిత రియల్‌టైమ్ పర్యవేక్షణ, డిజిటల్ నిర్వహణ వంటి సాంకేతికతల ద్వారా ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా మార్చవచ్చు.

**ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు**

ప్రభుత్వాలు ప్రతి వెయ్యి మంది జనాభాకు కనీసం ఒక ఆధునిక పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేసే లక్ష్యంతో ముందుకు సాగాలి. మార్కెట్లు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన రహదారులు, వాణిజ్య సముదాయాల్లో ఉచిత మూత్రశాలలను ఏర్పాటు చేయాలి.పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణలో ఐఓటీ, సెన్సార్ టెక్నాలజీ, ఆటోమేటెడ్ క్లీనింగ్ వ్యవస్థలను ప్రవేశపెట్టాలి. పారిశుధ్య కార్మికులకు ఆధునిక రక్షణ పరికరాలు, యాంత్రిక శుభ్రపరిచే సాధనాలు అందించాలి. స్వచ్ఛ భారత్ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత తీసుకురావాలి.ప్రభుత్వ పాఠశాలల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా పరిశుభ్రమైన మరుగుదొడ్లు, నిరంతర నీటి సరఫరా, తాగునీటి సదుపాయం తప్పనిసరిగా కల్పించాలి.

**పరిశుభ్రమైన మరుగుదొడ్లు --- ప్రతి పౌరుడి హక్కు**

స్వచ్ఛమైన మరుగుదొడ్లు విలాసం కాదు; అవి ప్రతి పౌరుడి ప్రాథమిక అవసరం. వ్యక్తిగత పరిశుభ్రతను కాపాడాలంటే ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే, పరిశుభ్రంగా నిర్వహించబడే, సాంకేతికతతో **పర్యవేక్షించబడే ప్రజా మరుగుదొడ్లు అవసరం.**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన నిర్వహణ, ప్రభుత్వ చిత్తశుద్ధి --- ఈ మూడు కలిసినప్పుడే “స్వచ్ఛ భారత్” నినాదం నిజమైన అర్థంలో ఆచరణలోకి వస్తుంది. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలంటే మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే కాదు; వాటి నిరంతర నిర్వహణ, పరిశుభ్రత, భద్రతలోనూ నూతన సాంకేతికతను తప్పనిసరిగా వినియోగించాల్సిన సమయం ఆసన్నమైంది.

# జెడ్ వీరారెడ్డి కాలనీలో మండల కమిటీ సమావేశం

## - సోలార్ కంపెనీల బాధిత రైతుల రాష్ట్ర సదస్సు



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలం జెడ్ వీరారెడ్డి కాల నీలో మండల కమిటీ సమావేశం మధ్యానం 3 గంటలకు నిర్వహించారు. ఈ సమావేశానికి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఉపాధ్యక్షులు ఓ నల్లప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సోలార్ బాధితులు రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించాలని ఆంధ్ర ప్ర దేశ్ రైతు సంఘం నిర్ణయించింది. ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గం టలకు పెద్ద షాది ఖానా ఫంక్షన్ హా ల్ గుత్తి నందు నిర్వహి స్తున్నట్లు ల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఉపాధ్యక్షులు ఓ నల్లప్ప తెలిపారు.నాయకులు మాట్లాడు తూ సోలార్ కంపెనీల నుండి రైతుల భూములను కాపాడాలని సోలార్ కంపెనీల మోసపూరిత ఒప్పందాల పై రైతులు మేల్కొనాలని సూచించా రు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పై మోసభ్యులు విధానాలకు నిరస నగా రైతుల్లో అవగాహన కల్పించేం దుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు రాయలసీమ అంటేనే కరువు గుర్తుకు వస్తుందని సాగునీటి ప్రాజెక్టులు పంట కాలవ లు పచ్చి పంటల పంటలు కనిపిం చవు విత్తనాలు పడని భూములు పిలవకపోయినా పలకరించే కరువు ఇది అనంతపురం జిల్లా కర్నూలు జి ల్లాల పరిస్థితి దీనిని కొద్దిగా కడప అన్నమయ్య జిల్లాలో నంద్యాల జి ల్లాల్లో కొన్ని మండలాలు కరువుకు నిలయంగా ఉన్నాయని ప్రభుత్వం ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునూరు అందిస్తే బంగారు పంటలు పండుతా యి అని కానీ ప్రభుత్వాలు సాగునీ టి ప్రాజెక్టులకు నిధులు అరకొర కే టాయించడం జరుగుతుందని వారు తెలిపారు రైతులకు సోలార్ కంపెనీ కి వివాదంగా వస్తే దూరంగా ఉన్న ఢిల్లీ ముంబై చెన్నై వంటి నగరాల్లో హెడ్ ఆఫీస్ లు పరిధిలో ఉన్న సి విల్ కోర్టులో కాకుండా రైతుల నివా సానికి దగ్గరలో ఉన్న సివిల్ కోర్టులో నే వివాదాలు పరిష్కరించుకునేం దుకు స్వేచ్ఛ రైతులకు ఉండాలని కోరారు ప్లీజ్ కాలంలో సోలార్ కం పెనీలు రైతుల భూముల మరి ఇత ర కంపెనీలకు అమ్మేందుకు ప్లీజ్ ఇ చ్చేందుకు అవకాశం లేకుండా శరత్ విధించాలి సోలార్ కారణంగా వ్యవ సాయ పనులు కోల్పోయే వ్యవసా య కూలీలకు ప్రభుత్వం సోలార్ కంపెనీల పునరావాసం కల్పించాల ని తెలిపారు.విద్యుత్తు ఉత్పత్తి ద్వా రా సోలార్ కంపెనీలు పొందే లాభా ల్లో భూములు ఇచ్చిన రైతులకు ప్ర తి ఏటా 10% డివిడెంట్ ఇవ్వాలి సోలార్ కంపెనీలు పొందే లాభాల్లో 10 శాతం నిధులు గ్రామాభివృద్ధికి ఖర్చుపెట్టేలా ప్రభుత్వం షరతు పెట్టి అమలు చేయించాలి ఏ గ్రామంలో సోలార్ కంపెనీ పెడితే ఆ గ్రామంలో ప్రజలందరికీ ఉచిత విద్యుత్ సరఫ రా చేయాలి ఒకసారి పెట్టుబడి పెడి తే 30 ఏళ్లు లాభాలే సోలార్ కంపెనీ పెట్టె పెట్టుబడి మొత్తం ఐదు సంవ త్సరాల్లో కంపెనీకి తిరిగి వస్తుంది.త ర్వాత 25 సంవత్సరాలు వచ్చే అం త సోలార్ కంపెనీలకు లాభమే ఇ లాంటి అనేక అంశాలు రైతులకు న ష్టం కలిగించే సోలార్ కంపెనీలకు లాభాలు కలిగించే షరతులను ప్ర భుత్వం జోక్యం చేసుకొని రద్దు చే యాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తుంది.ఈ కార్యక్రమం లో గుత్తి మండల కార్యదర్శి నిర్మల రైతు సంఘం నాయకులు రామకృ ష్ణ మద్దిలేటి మహిళా సంఘం నా యకులు రేణుక రేవతి కెవిపిఎస్ నాయకులు మల్లికార్జున సిఐటియు నాయకులు రమేష్ సహకారం సం ఘం నాయకులు మల్లేష్ మద్దిలేటి రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడి కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- పిల్లల బరువును స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్
- పిల్లల పోషణ, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం
- పౌష్టికాహారం అందజేతలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఆదేశం



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** పుట్లూరు మండలంలోని కందికాపుల, పుట్లూరు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రా లను మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో పిల్లలకు అందుతున్న సేవలు, పోషకాహార కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు.పిల్లల బరువును కలెక్టర్ స్వయంగా పరిశీలించి, సంబంధిత వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న తీరును తనిఖీ చేశారు. అనంతరం చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటిస్తూ, ఆటపాటలతో బడి బాగా జరుగు తోందా, అంగన్వాడీ టీచర్ తమను బాగా చూసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లతో కలెక్టర్ మాట్లాడుతూ, తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వారికి అవసరమైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లలు, గర్భిణీ స్త్రీల్లో రక్తహీనత నివారణకు క్రమం తప్పకుండా చర్యలు చేపట్టి, సంబంధిత వివరాలను యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు.యాప్‌లో నమోదు చేసే వివరాలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా, ఖచ్చితంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అలివేలమ్మ, ఎంపీడీవో బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 5 విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి
- అనంతపురం, ఉరవకొండలో బంద్‌ను విజయవంతం చేయాలని భాగ్ కన్వీనర్ నిఖిల్ తేజ్ పిలుపు




**ఉరవకొండ - సూర్య వాస్తవం :** అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పిలుపు మేరకు విద్యార్థి రంగాన్ని వేధిస్తున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 5న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని ఉరవకొండ భాగ్ కన్వీనర్ నిఖిల్ తేజ్ మంగళవారం పిలుపునిచ్చారు.అనంతపురం, ఉరవకొండ ప్రాంతాల్లో ఈ బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులకు, కళాశాల యాజమాన్యాలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న ఈ బంద్‌కు కళాశాలల యాజమాన్యాలు స్వచ్ఛందంగా సహకరించి విజయవంతం చేయాలని నిఖిల్ తేజ్ విజ్ఞప్తి చేశారు.

# శ్రీ లక్ష్మి చెన్నకేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి ముందుకొస్తున్న దాతలు

- యు.రామాంజనేయులు రూ.5,016 వితరణ



**పామిడి- సూర్య వాస్తవం:** పామిడి పెన్నానది ఒడ్డున వెలసిన శ్రీచెన్నకేశవస్వామి పురాతన దేవాలయం శిధిలావస్థకు చేరుకున్నది అందరికీ తెలిసిన విషయమే. వాటిని నిర్మాణానికి ప్రభుత్వం రెండు కోట్లు మంజూరు చేయగా అందుకు మ్యాచింగ్ ఫండ్స్ 20 లక్షల రూపాయలు కట్టవలసి ఉన్నది. అందులో భాగంగా కీర్తిశేషులు కల్పన హోటల్ యజమాని రామాంజనేయులు అల్లుడైన ఉపాధ్యాయుడు ఇల్లూరు యు.రామాంజనేయులు, ఆయన భార్య ఏఎన్ఎం కల్పన దంపతులు శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయ నిర్మాణానికి కుటుంబ సమేతంగా వచ్చి ప్రధాన పురోహితుడు పురుషోత్తం, మరియు కమిటీ సభ్యులకు 5,116 రూపాయలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ యు రామాంజనేయులు తో పాటు ఆయన భార్య కల్పన, తల్లి తండ్రి కూతురు, పురోహితుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురోహితులు పురుషోత్తం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మానానికి దాతలు ముందుకు రావలసిందిగా విజ్ఞప్తి చేశారు. నిర్మాణం త్వరగా పూర్తి కావాలంటే ప్రభుత్వానికి చెల్లించే 20 లక్షల కట్టవలసి ఉందని అందరూ సహృదయంతో దాతలుగా చేయూతనిచ్చి దేవుని కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## డీఎస్సీ-2025 అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ

# మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి

- ఉరవకొండ రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్
- డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు హెచ్చరిక
- పెండింగ్ బకాయిలతో వేలాది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన




**ఉరవకొండ - సూర్య వాస్తవం:** డీఎస్సీ--2025 పరీక్షల నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని ఉరవకొండ వైస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు.ఉరవకొండ నియోజకవర్గంలోని గోరకొండ యాదవ కళ్యాణ మండపంలో విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, బసవరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. డీఎస్సీ--2025లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన బకాయిల విడుదలతో పాటు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలుపై సమావేశంలో చర్చించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వై. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ, డీఎస్సీ--2025 నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన బకాయిలు ఇప్పటికీ విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు పూర్తై మూడో సంవత్సరంలోకి అడుగు పెడుతున్నప్పటికీ, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫల మైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంజునాథ్ రెడ్డి మాట్లాడుతూ, డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ప్రభుత్వం చెబుతున్నట్లయితే, నియమితులైన ఉపాధ్యాయులతోనే మంత్రి నారా లోకేష్ తన కుమారుడు దేవాంశ్‌కు బోధన చేయించేందుకు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పురుషోత్తం, మాజీ జెడ్పీటీసీ తిప్పేస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అబ్బాస్, ఎస్సీ--ఎస్టీ ఐక్యవేదిక నాయకుడు మధు తదితరులు మాట్లాడుతూ, నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర విద్యారంగం నిర్వీర్యమైందని విమర్శించారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ.9,100 కోట్లకు చేరుకున్నాయని, వాటి విడుదలలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అదే విధంగా, కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడో సంవత్సరం నడుస్తున్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని అమలు చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందని ఆరోపించారు.

అర్హులైన నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతి అందజేయాలని కోరారు. డీఎస్సీ--2025లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని సమావేశంలో పలువురు డిమాండ్ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి సి పి వీరన్న మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, పెండింగ్ బకాయిలు, నిరుద్యోగ భృతి తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే అన్ని రాజకీయ పార్టీలు, ఐక్య విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, వివిధ సామాజిక సంస్థలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# మహిళలపై వేధింపులను తీవ్రమైన నేరంగా పరిగణిస్తాం

- ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ
- స్టాకింగ్, సైబర్ స్టాకింగ్‌పై విద్యార్థినులకు అవగాహన
- మహిళల రక్షణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ
- ఎస్కేయూలో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న అనంతపురం పీటీసీ ప్రిన్సిపల్ సుప్రజ,
- ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జుల హేమలత



**అనంతపురం విద్య - సూర్య వాస్తవం:** మహిళలపై వేధింపులు, స్టాకింగ్, సైబర్ స్టాకింగ్ వంటి ఘటనల నివారణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. మహిళలపై వేధింపులను చిన్న విషయంగా తీసుకోకుండా, ప్రారంభ దశలోనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతపురం సమీపంలోని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) ఇంజినీరింగ్ విభాగ సమావేశ మందిరంలో జాతీయ మహిళా కమిషన్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలపై వేధింపులు, స్టాకింగ్, సైబర్ స్టాకింగ్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రాయపాటి శైలజ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువతలో అవగాహన పెంపొందించడం ద్వారానే స్టాకింగ్ వంటి నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. ఒక వ్యక్తి ఇష్టానికి వ్యతిరేకంగా నిరంతరం వెంబడించడం, గమనించడం లేదా వారి అనుమతి లేకుండా వ్యక్తిగత జీవితంలోకి చొరబడేందుకు ప్రయత్నించడం స్టాకింగ్‌గా పరిగణిస్తామని తెలిపారు. ఇది చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు.సమాజంలో చాలామంది యువతులు, మహిళలకు స్టాకింగ్ అంటే ఏమిటి, అది ఎలాంటి రూపాల్లో జరుగుతుందనే విషయంపై పూర్తి అవగాహన లేకపోవడంతో వేధింపులను మౌనంగా భరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తిని పదేపదే వెంబడించడం, వద్దని చెప్పినా ఆగకుండా సందేశాలు, ఫోన్ కాల్స్, బహుమతులు లేదా లేఖలు పంపడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బంది పెట్టడం, నకిలీ ఖాతాలు సృష్టించి వేధించడం వంటి చర్యలు స్టాకింగ్ పరిధిలోకి వస్తాయని వివరించారు.గతంలో భౌతికంగా వెంబడించడం వంటి ఘటనలు ఎక్కువగా ఉండేవని, ప్రస్తుతం సైబర్ స్టాకింగ్ కేసులు వేగంగా పెరుగు తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు ముందుగా వేధింపులను గుర్తించి, సంబంధిత ఆధారాలను భద్రపరచడంతో పాటు వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.పీటీసీ ప్రిన్సిపల్ సుప్రజ మాట్లాడుతూ, వివిధ కేస్ స్టడీలను వివరించారు. వివాహిత మహిళలు కూడా స్టాకింగ్‌కు గురవుతున్న ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. సీనియర్ ఏపీపీ ఎన్.సి. సంగీత స్టాకింగ్‌కు సంబంధించిన చట్టాలు, ఫిర్యాదు చేసిన తర్వాత జరిగే న్యాయ ప్రక్రియపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.మానసిక నిపుణులు డాక్టర్ సురేఖ మాట్లాడుతూ, స్టాకింగ్ కారణంగా బాధితుల్లో భయం, ఆందోళన, మానసిక ఒత్తిడి వంటి ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉందని వివరించారు. అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జుల హేమలత పలు కేస్ స్టడీలను సదస్సులో వివరించారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసి తనకు ఎదురైన అనుభవాన్ని పంచుకుంది. వేధింపుల కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురైనట్లు ఆమె తెలిపిన ఘటన కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఆలోచింపజేసింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ, మహిళల భద్రత కోసం ప్రత్యేక కార్యాచరణతో పాటు చట్టపరమైన చర్యలు చేపడుతోందని డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై చర్చలు నిర్వహించడంతో పాటు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాకింగ్, సైబర్ స్టాకింగ్ నివారణపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా అనంతపురం పీటీసీ ప్రిన్సిపల్ సుప్రజ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జుల హేమలత, సీనియర్ ఏపీపీ ఎన్.సి. సంగీత, మానసిక నిపుణులు డాక్టర్ సురేఖ, మహిళా కమిషన్ సలహాదారు సూయజ్, ఐసీడీఎస్ పీడీ సాజిదా బేగం, ఎస్కేయూ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర, అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ నోడల్ అధికారి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ హరిణి తదితరులు పాల్గొన్నారు.అలాగే అధ్యాపకులు, ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. డీఎంసీ శ్రీదేవి, డీసీపీఓ మంజునాథ్, సఖి మేనేజర్ శాంతామణి, ఉద్యోగులు రాజ్యలక్ష్మి, మంజుల, దుర్గ, శ్రీకళ, డీవీసీ ఉమాదేవి, నర్మద, షాకీర్, ఐసీడీఎస్ అధికారులు బాబా నూరుద్దీన్, లక్ష్మీప్రసన్న, నాగమణి, ఉమాశంకరమ్మ, ఐసీపీఎస్ వెంకట్ కుమార్, జూనియర్ సంధ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# గజరాంపల్లిలో ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి మండలంలోని గజరాంపల్లి గ్రామంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాలు వారోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు అమృతంతో సమానమని, అది శిశువుకు రోగనిరోధక శక్తిని అందిస్తుందని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.ప్రతి తల్లి తన బిడ్డకు ఖచ్చితంగా తల్లిపాలు అందించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మునేశ్వరి, ఆశా వర్కర్లు విజయలక్ష్మి, మహేశ్వరి, మహిళా పోలీస్ హైమావతి, అంగన్‌వాడీ టీచర్లు బి.స్వప్న,లక్ష్మీదేవి పాల్గొన్నారు.వారితో పాటు అంగన్‌వాడీ ఆయాలు, గ్రామానికి చెందిన గర్భవతులు, బాలింతలు పిల్లలు వారితల్లిదండ్రులు పెద్ద ఎద్దున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తాగునీటి సమస్యపై ప్రజలు తీవ్ర ఆందోళన




**గార్లదిన్నె - సూర్యవాస్తవం:** గార్లదిన్నె మండలంలోని పాతకల్లూరు గ్రామంలో వారం రోజులుగా తాగునీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుక్కెడు నీళ్ల కోసం అల్లాడిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. గ్రామంలో నీటి వసతి లేక, పశువులకు తాగునీరులేక కొట్టుమిట్టులా డుతున్నాయి. పొలాల్లో మోటార్లు ఆన్ చేసిన చోటకి కిలోమీటర్ల దూరానికి నడుచుకుంటూ వెళ్లి,బిందెలు మరియు డ్రమ్ములలో నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గ్రామస్తులు తాగునీటి కోసం అల్లాడిపోతున్నా, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు నాయకులు మాత్రం కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తపరిచారు. చంద్రబాబు నాయుడు అభివృద్ధి సంక్షేమం అంటే ఇదేనా, తాగునీటి సమస్యను తీర్చలేని ప్రభుత్వం ఆర్భా టాలు ప్రచారాలు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి, తక్షణమే తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## కరాటేలో నారాయణ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**కదిరి - సూర్య వాస్తవం:** కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఆగస్టు రెండు న సీఎంఏ గ్రాండ్ కన్వెన్షన్ వేదికగా జపాన్ కరాటే షోటోకాన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 15వ జాతీయ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో కదిరికి చెందిన ప్రముఖ కరాటే మాస్టర్ అక్బర్ అలీ శిక్షణలోని విద్యార్థులు పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. అనంతరం ఈ జాతీయ స్థాయి కరాటే పోటీలలో, కతాస్ విభాగాల్లో బ్లాక్ బెల్ట్ విభాగంలో హానిక రాయల్ కోలా గోల్డ్ మెడల్ సాధించగా ఆరెంజ్ బెల్ట్ విభాగంలో మొహమ్మద్ కైఫ్ గోల్డ్ మెడల్ సాధించగా వైట్ బిల్ట్ విభాగంలో తన్వీర్ రాయల్ కోలా గోల్డ్ మెడల్ సాధించారు వీరికి కదిరి నారాయణ స్కూల్ ఏజీఎం సర్ఫరాజ్ ఖాన్ , అకాడమిక్ డీన్ విష్ణు వర్ధన్ రెడ్డి, ఏవో జక్రియ , చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలని అందజేశారు , అనంతరం విజేతలను మంగళ వారం కదిరి నారాయణ పాఠశాల లో అభినందన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు ,అనంతరం నారాయణ స్కూల్ ఏజీఎం సర్ఫరాజ్ ఖాన్ మాట్లాడుతూ "కరాటే కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు, అది క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, ఆత్మరక్షణ, శారీరక దృఢత్వం మానసిక స్థైర్యాన్ని పెంపొందించే గొప్ప విద్య. చిన్న వయస్సు నుంచే కరాటే నేర్చుకోవడం వల్ల పిల్లల్లో ఏకాగ్రత, ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయిఅని పేర్కొన్నారు,నేటి సమాజంలో ప్రతి విద్యార్థి కరాటే వంటి ఆత్మరక్షణ విద్యను తప్పనిసరిగా అభ్యసించాలని సూచించారు, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గెలుపొందాలని కోరారు ,అలాగే శిక్షణ ఇచ్చిన మాస్టర్ అక్బర్ అలీని నారాయణ స్కూల్ యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఏపిడబ్ల్యూజేఎఫ్ ఎజెండా




**సింగనమల - సూర్య వాస్తవం :** శింగనమల మండల వ్యాప్తంగా వివిధ పత్రికల లో ఎలక్ట్రానిక్ ఛానల్ లలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ముఖ్య లక్ష్యంగా ముందుకు వెళుతోంది. ఏపీడబ్ల్యూజేఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే జర్నలిస్టులు ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు అందించా లని ఇంటి స్థలంతో పాటు పక్కాగృహాలు మంజూరు చేయించి నిర్మించి ఇవ్వాలని శింగనమల ఎమ్మెల్యే శ్రీ బండారు శ్రావణి శ్రీకి వినతిపత్రం సమర్పించారు. అందుకు ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించడం సంతోషకరం. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ నియోజవర్గ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. అదేవిధంగా జర్నలిస్టుల ప్రతి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ఏపీడబ్ల్యూజెఎఫ్ మండల కమిటీ పనిచేస్తూ ముందుకు నడుస్తోంది.ఏ జర్నలిస్టుకు సమస్య జరిగిన ఏపీడబ్ల్యూజేఎఫ్ ముందు ఉంటుంది.మన మండల కమిటీకి శింగనమల నియోజకవర్గం మరియు అనంతపురం జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ కమిటీ సభ్యులు కూడా పూర్తి సహకారం అందిస్తుండడం సంతోషకరం.ఇదేవిధంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అందరం కలిసికట్టుగా ముందుకు నడుద్దాం అని ఏపీడబ్ల్యూజేఎఫ్ శింగనమల మండల కమిటీ తెలిపింది.

## స్థానిక సంస్థల ఎన్నికల వేళ
# ఉనికి కోసం అలజడులు సృష్టిస్తున్న వైసీపీ

- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం
- రాంనగర్ 80 ఫీట్ రోడ్డులో 'ఇంటింటికి కూటమి ప్రభుత్వం'
- ఎమ్మెల్యే దగ్గుపాటికి ఘన స్వాగతం పలికిన నాయకులు, కార్యకర్తలు



**అనంతపురం ప్రతినిధి- సూర్య వాస్తవం :** ఉరవకొండలో వైసీపీ నాయకుల నిరసనపై ఎమ్మెల్యే ఆగ్రహం అనంతపురం, ఆగస్టు 4: స్థానిక సంస్థల ఎన్నికల వేళ తమ ఉనికిని చాటుకునేందుకు వైసీపీ రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతపురం నగరంలోని 35వ డివిజన్ పరిధిలోని రాంనగర్ 80 ఫీట్ రోడ్డులో మంగళవారం ఆయన 'ఇంటింటికి కూటమి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు ఘన స్వాగతం పలికారు.కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసుల నుంచి ఎమ్మెల్యేకు మంచి స్పందన లభించింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ, వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి తన పాలన తరహాలోనే కూటమి ప్రభుత్వం కూడా విధ్వంసకర పాలన చేస్తుందని భావించారని అన్నారు. అయితే, గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు.గత ఐదేళ్ల వైసీపీ పాలన వల్ల రాష్ట్రం ఎంతో నష్టపోయిందని ఆయన ఆరోపించారు. 2014 నుంచి 2019 వరకు దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. అనంతరం "ఒక్క ఛాన్స్" అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాంతరంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. మరోవైపు రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు తీసుకువస్తూ ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో గత రెండేళ్లలో రూ.1,296 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. సుమారు 25 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలకు పరిష్కారం చూపించామని తెలిపారు. రానున్న మూడేళ్లలో మరో రూ.3,000 కోట్లతో నియో జకవర్గంలో విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక, స్థానిక సంస్థల ఎన్నికల్లో తమను ప్రజలు పట్టించుకోరనే ఉద్దేశంతో వైసీపీ నాయకులు ఏదో ఒక అంశంపై ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నారని విమర్శించారు.మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వారు ఒక్క ఆధారమైనా చూపించాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. అక్రమాలకు సంబంధించి ఆధారాలు చూపాలని ప్రశ్నిస్తే ఒక్కరు కూడా ముందుకు రావడం లేదని అన్నారు. ఎంతో కష్టపడి మెగా డీఎస్సీ ద్వారా 16,347 మంది ఉద్యోగాలు సాధించారని, వారిని అవమానించేలా పేపర్ లీకేజీలు జరిగాయని, లంచాలు తీసుకున్నారని నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.ఉరవకొండలో వైసీపీ నాయకులు చేపట్టిన నిరసనలపై కూడా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకుని, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నీరు వచ్చినా తెచ్చుకోలేని 'విజనరీ బాబు

- వైసీపీ విమర్శ
- శ్రీశైలం వరద జలాలు దిగువకు...
- రాయలసీమకు మాత్రం దక్కని నీరు!
- హంద్రీ-నీవా పంపింగ్‌పై నిర్లక్ష్యం...
- పోతిరెడ్డిపాడుకు తప్పని నిరీక్షణ



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇప్పటికే సుమారు వంద టీఎంసీలకు పైగా వరద జలాలు జలాశయానికి చేరినట్లు సమాచారం. ఒకవైపు తెలంగాణ ప్రభుత్వం పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోస్తుంటే, మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం మీనమేషాలు లెక్కబెడుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మల్యాల వద్ద హంద్రీ--నీవా ఎత్తిపోతల పథకానికి నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, పంపింగ్‌ను ప్రారంభించలేదని ఆరోపిస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు కూడా ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదని పేర్కొంటున్నారు.

అయితే, శ్రీశైలం జలాశయానికి వచ్చిన వరద నీటిని విద్యుత్ ఉత్పత్తి, తాగునీటి అవసరాల పేరుతో దిగువకు విడుదల చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం జీఓ 69ను ప్రస్తావిస్తూ రోజువారీగా నీటిని వినియోగించు కుంటోందని ఆరోపించారు. అంతే కాకుండా, 800 అడుగుల నీటి మట్టం నుంచే నీటిని ఎత్తిపోసేలా నిర్మించిన పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా శ్రీశైలం నుంచి రోజుకు సుమారు ఒకటిన్నర టీఎంసీల నీటిని తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు.

ఈ పరిస్థితులను ముందుగానే గుర్తించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, శ్రీశైలం జలాశయంలో 790 అడుగుల నీటి మట్టం నుంచే నీటిని ఎత్తిపోసేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారని తెలిపారు. అయితే, చంద్రబాబు ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పక్క రాష్ట్ర ప్రయోజనాలకు తాకట్టు పెట్టినట్లుగా వ్యవహరించి, నిర్దాక్షిణ్యంగా నిలిపివేసిందని విమర్శించారు.రాయలసీమ రైతులకు సాగునీటి అవసరం లేదన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా లక్షల ఎకరాల్లో సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల పేరుతో రైతుల నుంచి 30 సంవత్సరాల లీజు ఒప్పందాల ద్వారా భూములను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ పంటలకు బదులుగా 'కరెంటు పంటలు' పండించే పరిస్థితి తీసుకొస్తున్నారని విమర్శించారు.ఎనర్జీ కంపెనీలు భారీ రుణాలు తీసుకుని లాభాలను ఇతర ప్రాంతాలకు తరలించుకుంటున్నాయని ఆరోపించారు. రాయలసీమ ప్రజలు ఇప్పటికైనా మేల్కొని ప్రశ్నించకపోతే తుంగభద్ర, కృష్ణా నదుల జలాలను రాయలసీమకు తీసుకురావడం కష్టమవుతుందని హెచ్చరించారు.చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పాలించినప్పటికీ రాయలసీమ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయారని విమర్శించారు. ఈ పరిస్థితులకు బాధ్యత వహిస్తూ ప్రభుత్వం సమాధానం చెప్పాలని వైస్సార్సీపీ రాయలసీమ జోన్ అధికార ప్రతినిధి కె వి రమణ డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రజలు ఐక్యంగా ముందుకు వచ్చి, వైఎస్సార్‌సీపీ గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల టాస్క్‌ఫోర్స్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాన్ని నిలదీసి, కృష్ణా--తుంగభద్ర నదీ జలాలను రాయలసీమకు సాధించుకోవాలని కోరారు.

## అంగరంగ వైభవంగా పామిడమ్మ తిరుణాల



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలోని 44వ జాతీయ రహదారి పక్కన వెలసిన పామిడమ్మ దేవత తిరుణాల సందర్భంగా అమ్మవారికి వేకువ జాముననే పురోహితుడు వెంకట్రాముడు అభిషేకములు అర్చనలు నిర్వహించి ఘనంగా అమ్మవారిని పట్టు వస్త్రములు గజమాలలతో అలంకరించి వివిధ రకాల వంట కాలను తయారుచేసి అమ్మవారికి నైవేద్యముగా సమర్పించారు. భక్తులు ఫలాలు, పుష్పాలు, తాంబూలాలు, టెంకాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి సంవత్సరం జేష్ట మాసం పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం ఈతిరుణాల నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. భక్తులతో ఆలయ ప్రాంగణం అంతయూ కీటకిట లాడింది. భక్తాదులు మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ భక్తాదులకు అన్ని సౌకర్యములను ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో వేలాది మంది భక్తాదులతో పాటు అఖిలపక్ష రాజకీయ నాయకులు కార్యకర్తలు శ్రేణులు పాల్గొన్నారు. సీఐ శివశంకర్ నాయక్ నేచుత్వంలో శాంతి భద్రతలను పరిరక్షించారు.

## రాష్ట్రవ్యాప్తంగా రూ 1,200 కోట్లు వ్యయంతో ఆరోగ్య మౌలిక వసతులుఅభివృద్ధి పనులు

### - మంత్రి సత్య కుమార్ యాదవ్





**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా రూ1,200 కోట్లు వ్యయంతో ఆరోగ్య మౌలిక వసతులు అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు గత రెండు ఏళ్లలో 12 వేలకు పైగా ఆరోగ్య సిబ్బందిని నియమించామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య ఌ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నాడు ఆయన మంగళవారం నూజివీడు నియోజకవర్గం చనుబండ గ్రామంలో రూ. 1.93 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సి) శంకుస్థాపన,ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రారంభోత్సవం, రూ.55 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో సహచర మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన పీహెచ్ సి తో పాటు రూ.55 లక్షల వ్యయంతో ఆధునిక వైద్య ప్రయోగశాల (ల్యాబ్)ను కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. 2027 మార్చి నాటికి నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 1,200 కోట్ల వ్యయంతో ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు,గత రెండేళ్లలో 12 వేలకుపైగా ఆరోగ్య సిబ్బందిని నియమించామని,మరో 3 వేల మంది వైద్యుల నియామక ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి నాణ్యమైన,అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలు చేరేలా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి సంక్షేమం

### - ఇంటింటికి కరపత్రాలతో మాజీ ఎంపీటీసీ ఉదయ్ కుమార్



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పరిపాలనలో చేసిన అభివృద్ధి-సంక్షేమ పథకాలను ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి సంక్షేమం అనే కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డా,, నెలవల.విజయశ్రీ,టిడిపి సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు ఆయా మండలాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏకొల్లు మాజీ ఎంపీటీసీ,టిడిపి నాయకుడు బందిలి.ఉదయ్ కుమార్ మంగళవారం దొరవారిసత్రం మండలంలోని, వారి సొంత గ్రామం ఏకొల్లు లో ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ,అందరూ పార్టీకి అండగా ఉండాలని,పార్టీ బలోపేతం కోసం అందరి సహకారం కావాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాకుండా రెండేళ్లలో జరిగిన అభివృద్ధి పనుల గురించి గ్రామస్తులకు తెలియజేశారు. వీరితోపాటు తెలుగుదేశం పార్టీ, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై కత్తితో దాడి

### - బాధితుడు చెన్నై ఆసుపత్రికి తరలింపు



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** తడ మండలం, వెండ్లురుపాడు గ్రామానికి చెందిన పాలా పోలయ్య కుమారుడు పాలా పవన్(27)అనే యువకుడు సోమవారం రాత్రి సుమారు 10:00 గంటల సమయంలో గ్రామంలోని వెంకటేశ్వరస్వామి గుడి వద్ద పడుకుని ఉండగా అదే గ్రామానికి చెందిన బూరగ వెంకటేశ్వర్లు గుడి స్థలం తన నాయనది అనే కారణంతో తన వద్ద ఉన్న కల్లు గీసే కత్తితో పాలా పవన్ గొంతు, వీపు, పొట్ట మరియు ఎడమ చేతి వేళ్లపై నరికి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన పవన్ శరీరం నుంచి రక్తస్రావం కావడంతో గమనించిన రాజేష్, మరికొందరు గ్రామస్థులు వెంటనే బాధితుడిని సూళ్లూరు పేటలోని వీనస్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం చెన్నైలోని ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి పాలా పోలయ్య ఇచ్చిన ఫిర్యాదు/స్టేట్‌మెంట్ మేరకు తడ కొండప్ప నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# స్వర్ణముఖిని మింగేస్తున్న ఇసుక మాఫియా..

- పెళ్లకూరులో పట్టపగలే అక్రమ రవాణా
- "రైట్.. రైట్.." అంటూ ట్రాక్టర్ల పరేడ్..
- అధికారుల మౌనంపై అనుమానాలు
- అక్రమ ఇసుక దందాతో భూగర్భ జలాలకు ముప్పు.. రైతుల ఆందోళన
- రావులపాడు, పెన్నేపల్లి, ఎడపూడి, పుల్లూరు ప్రాంతాల్లో స్వర్ణముఖి నదిపై విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు
- ట్రాక్టర్ ట్రిప్పులకు రేట్లు నిర్ణయించి కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం జరుగుతోందన్న ఆరోపణలు
- గ్రామీణ రహదారులు ధ్వంసం.. వ్యవసాయ బోర్లలో పడిపోతున్న నీటిమట్టం
- కలెక్టర్, ఎస్పీ జోక్యంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దందాపై ఉక్కుపాదం మోపాలని రైతులు, గ్రామస్తుల విజ్ఞప్తి





**పెళ్లకూరు- సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో మాత్రం అక్రమార్కులు బరితెగించి స్వర్ణముఖి నదిని యథేచ్ఛగా కొల్లగొడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు అక్రమ ఇసుక రవాణాపై రాజీ లేకుండా వ్యవహరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, మండలంలో మాత్రం ఆ ఆదేశాలు అమలులో కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని రావులపాడు, పెన్నేపల్లి, ఎడపూడి, పుల్లూరు గ్రామాల పరిధిలో ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది నుంచి ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండానే భారీ ఎత్తున ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాక్టర్లు వరుసగా సంచరిస్తూ "రైట్... రైట్..." అంటూ బహిరంగంగానే ఇసుకను తరలిస్తున్నప్పటికీ, సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

**సిండికేట్‌గా మారిన అక్రమ దందా.. ట్రిప్పులకు ఫిక్స్‌డ్ రేట్లు**

అక్రమ ఇసుక వ్యాపారం కొందరి చేతుల్లో సిండికేట్‌గా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు. ట్రాక్టర్ ట్రిప్పుకు ముందుగానే ఒక నిర్దిష్ట రేటు నిర్ణయించి, అదే ధరకు ఇసుకను విక్రయిస్తూ కోట్ల రూపాయల అక్రమ ఆదాయం పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉచిత ఇసుక విధానాన్ని పూర్తిగా పక్కనబెట్టి, ప్రజల అవసరాలను అవకాశంగా మలుచుకుని అక్రమార్కులు భారీగా లాభాలు ఆర్జిస్తున్నారని స్థానికులు అంటున్నారు.

**అతి వేగంతో ట్రాక్టర్లు.. రోడ్లకు చీలికలు**

ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు గ్రామీణ రహదారులపై అధిక వేగంతో ప్రయాణించడం వల్ల ఇప్పటికే అనేక రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడి ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. ప్రమాదాల భయం రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భూగర్భ జలాలకు ముప్పు.. రైతాంగంలో ఆందోళన**

స్వర్ణముఖి నదిలో విచక్షణారహితంగా లోతైన గోతులు తీసి ఇసుకను తరలించడం వల్ల భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్లలో నీటిమట్టం గణనీయంగా తగ్గిందని, ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో సాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని చెబుతున్నారు. పంటల సాగు కష్టసాధ్యమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఫిర్యాదులు చేసినా ఫలితం లేదంటున్న గ్రామస్థులు**

అక్రమ ఇసుక రవాణాపై పలుమార్లు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా, ఆశించిన స్థాయిలో స్పందన లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఒక శాఖ మరో శాఖపై బాధ్యత నెట్టేస్తూ కాలయాపన చేస్తోందని, దీంతో అక్రమార్కులు మరింత ధైర్యంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకోవాలన్న డిమాండ్**

మండలంలో సాగుతున్న అక్రమ ఇసుక దందాపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి సంయుక్త తనిఖీలు నిర్వహించాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు. అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారితో పాటు వారికి సహకరిస్తున్న వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. స్వర్ణముఖి నదిని పరిరక్షించేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలని రైతులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**తహసీల్దార్ స్పందన**

ఈ అంశంపై పెళ్లకూరు తహసీల్దార్ సీహెచ్. హరికృష్ణ మాట్లాడుతూ, మండలంలో కేవలం సొంత ఇంటి నిర్మాణ అవసరాల కోసం మాత్రమే నిబంధనల ప్రకారం ఇసుకకు అనుమతులు జారీ చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా ఇసుక అవసరమైతే ముందస్తుగా అధికారిక అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మండల పరిధిలోని ఏ ప్రాంతం నుంచి అయినా అక్రమంగా ఇసుకను తవ్వడం లేదా తరలించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు అందితే వెంటనే విచారణ నిర్వహించి, అక్రమాలకు పాల్పడిన వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని తెలిపారు.

## మహిళల భద్రత, సైబర్ నేరాలు, శక్తి యాప్‌పై సమగ్ర అవగాహన

- సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు
- మహిళలు, చిన్నారుల రక్షణకు సూచనలు
- డ్రగ్స్, ర్యాగింగ్,ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ నిబంధనలు, సోషల్ మీడియా భద్రతపై సూచనలు.
- అత్యవసర పరిస్థితుల్లో డయల్-112, శక్తి యాప్ వినియోగించాలని సూచన



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు,ఐపీఎస్.ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మహిళలు, విద్యార్థులు, యువతలో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు శక్తి టీమ్ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో బి.ఎడ్. విద్యార్థినులకు శక్తి టీమ్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఈవ్ టీజింగ్,ర్యాగింగ్,శక్తి యాప్ వినియోగం ప్రయోజనాలు, లోన్ యాప్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు,చైల్డ్ పోర్నోగ్రఫీ,సైబర్ నేరాలు,తెలియని లింకులు, వీడియో కాల్స్ ద్వారా జరిగే మోసాలు, సోషల్ మీడియాలో ఫోటోలు పంచుకోవడం వల్ల కలిగే ప్రమాదాలు,ఉద్యోగ మోసాలు,ఓటీపీ మోసాలు, ఆన్‌లైన్ బెట్టింగ్,మహిళల అక్రమ రవాణా, మహిళలపై నేరాలు,డ్రగ్స్ దుష్పరిణామాలు, ట్రాఫిక్ నిబంధనలు, ర్యాపిడో,ఆటో,బైక్ ప్రయాణాల్లో పాటించాల్సిన భద్రతా సూచనలు, సమాజంలో మహిళలకు సంబంధించిన తాజా ఘటనలు,మంచి స్నేహం,మంచి ప్రవర్తన,వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు.అనంతరం ఎల్.బి. నగర్ రోడ్డులోని ఎస్పీ డబ్ల్యూ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శక్తి టీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది.సైబర్ నేరాలు,శక్తి యాప్,లోన్ యాప్ మోసాలు,డిజిటల్ అరెస్ట్,ఈవ్ టీజింగ్,ర్యాగింగ్,సోషల్ మీడియా దుర్వినియోగం,తెలియని లింకులు,వీడియో కాల్స్, డ్రగ్స్,ట్రాఫిక్ నిబంధనలు,సెల్‌ఫోన్ సోషల్ మీడియా అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలు, ఆన్‌లైన్ గేమ్స్,మంచి అలవాట్లు, మంచి స్నేహం, మహిళలపై నేరాలు,మహిళల అక్రమ రవాణా, సమాజంలో చోటు చేసుకుంటున్న మహిళలకు సంబంధించిన ఘటనలు, అత్యవసర హెల్ప్‌లైన్ సేవల వినియోగంపై అవగాహన కల్పించారు.

అదేవిధంగా అన్నమయ్య పాఠశాల, కటికరంగాడి వీధిలో విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో శక్తి యాప్,ఈవ్ టీజింగ్,సోషల్ మీడియా సెల్‌ఫోన్ దుర్వినియోగం, తెలియని వ్యక్తులతో పరిచయాల ప్రమాదాలు, టీనేజ్ ప్రేమ వ్యవహారాలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం,నైతిక విలువలు, విద్య ప్రాముఖ్యత, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులను గౌరవించడం, మహిళలు చిన్నారుల భద్రత, బాలలపై నేరాలు, బాల్య వివాహాలు,బాల కార్మిక వ్యవస్థ,బాలల అదృశ్యం, కిడ్నాప్‌లు, డ్రగ్స్, మొబైల్ గేమ్స్ వ్యసనం, ట్రాఫిక్ నిబంధనలు, మంచి అలవాట్లు,మంచి స్నేహం, వ్యక్తిగత భద్రత,అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శక్తి టీమ్ విద్యార్థులు అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, ఫోటోలు, బ్యాంకింగ్ సమాచారం ఇతరులతో పంచుకోవద్దని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్, అత్యవసర పరిస్థితుల్లో డయల్-112ను సంప్రదించాలని సూచించింది.మహిళల భద్రత కోసం శక్తి యాప్ను ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించాలని, నేరాల నివారణలో ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.



## ఆరు మాసాల వరకు విధిగా తల్లిపాలే పట్టించాలి

### - సూపర్వైజర్ అంకమ్మ



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** ప్రతి తల్లి జన్మనిచ్చిన బిడ్డకు విధిగా తల్లిపాలనే పట్టించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ అంకమ్మ సూచించారు. మంగళవారం దొరవారిసత్రం మండల పరిధిలోని బూదూరు అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లులతో మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే తప్పక తల్లి పాలను పట్టిస్తూ, ఆరు మాసాల వరకు కొనసాగిస్తే తల్లిపాలు బిడ్డకు అమృతంగా పని చేస్తుందని అన్నారు.బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. అంతేకాకుండా అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లుగా బిడ్డకు తల్లిపాలన కొనసాగించాలని పేర్కొన్నారు. గర్భిణి, బాలింతలు అంగన్వాడీ కేంద్రంలో సరఫరా చేసే పోషక విలువలు కలిగిన పదార్థాలను ఆహారంగా తీసుకోవాలని తెలియజేశారు. ప్రతి వ్యక్తికి దినసరి అవసరమైన కేలరీల శక్తి పొందాలంటే సమ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను దినసరి ఆహారంలో తీసుకోవాలన్నారు. గుడ్డు, వేరుశెనగ చిక్కీలు,రాగి పిండిలో ఐరన్ కలిగిన పోషకాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రాధమ్మ, అంకమ్మ గర్భవతి, బాలింతలు పాల్గొన్నారు.

## అప్పుడు క్లాప్ అసిస్టెంట్..

# ఇప్పుడు అదే హీరోకి ప్రొడ్యూసర్.. నానిది అసలైన విజయం!

నితిన్ హీరోగా నాని నిర్మాణంలో 'అలియాస్ రుక్మిణీ'21 ఏళ్ల క్రితం నితిన్ సినిమాకు క్లాప్ అసిస్టెంట్‌గా నాని-ఇప్పుడు అదే నితిన్ చిత్రానికి నిర్మాతగా మారిన వైనం-నాని సినీ ప్రయాణం స్ఫూర్తిదాయకమంటున్న అభిమానులు

సినీ పరిశ్రమలో ఎవరి జాతకం ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పలేం. ఒకప్పుడు క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేసిన వ్యక్తి, రెండు దశాబ్దాల తర్వాత అదే హీరోతో సినిమా నిర్మించే స్థాయికి ఎదగడం నిజంగా ఓ అద్భుతం. అలాంటి స్ఫూర్తిదాయక ప్రయాణమే నేచురల్ స్టార్ నానిది. హీరో నితిన్ కథానాయకుడిగా, నాని సమర్పణలో 'అలియాస్ రుక్మిణీ' అనే కొత్త చిత్రం నిన్న హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఓ ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 21 ఏళ్ల క్రితం, 2005లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో నితిన్ హీరోగా నటించిన



'అల్లరి బుల్లోడు' సినిమాకు నాని క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేశారు. అప్పట్లో నితిన్‌పై చిత్రీకరించిన సన్నివేశాలకు క్లాప్ కొట్టిన నాని, ఇప్పుడు అదే నితిన్ సినిమాకు నిర్మాతగా మారి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టడం విశేషం. ఈ రెండు సందర్భాలకు సంబంధించిన ఫొటోలను పోలుస్తూ.. 'ఇదే కదా అసలైన సక్సెస్' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు. దర్శకుడు కావాలనే లక్ష్యంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాని, లెజెండరీ డైరెక్టర్ బాపు వద్ద 'రాధా గోపాళం' సినిమాకు, ఆ తర్వాత రాఘవేంద్రరావు వద్ద డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా స్వయంకృషితో పైకొచ్చారు. అనుకోకుండా 'అష్టా చమ్మా' చిత్రంతో హీరోగా మారి, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ, సినిమా సినిమాకు తన నటనను మెరుగుపరుచుకుంటూ ప్రేక్షకుల హృదయాల్లో పక్కింటి కుర్రాడిగా స్థానం సంపాదించారు. ఒకప్పుడు మినిమమ్ గ్యారెంటీ హీరోగా పేరు తెచ్చుకున్న నాని, ఇప్పుడు రూ.100 కోట్ల మార్కెట్ ఉన్న స్టార్‌గా ఎదిగారు. హీరోగానే కాకుండా నిర్మాతగానూ అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తున్నారు. ఒకప్పుడు క్లాప్ అసిస్టెంట్‌గా ఉన్న స్థాయి నుంచి, అదే హీరోతో సినిమా నిర్మించే స్థాయికి ఎదగడం ఆయన పట్టుదలకు, కష్టానికి నిదర్శనం. త్వరలో ఆయన మెగాస్టార్ చిరంజీవితోనూ ఓ సినిమా చేయనుండటం ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనుంది.

## జ్యోతిక నాపై నమ్మకం ఉంచింది..

# అందుకే ఆ సాహసం చేశా: సూర్య



'కరుప్పు' సినిమా విడుదలకు ముందు ఆర్థిక ఇబ్బందులు ఎదురైన వైనంచివరి నిమిషంలో అదనపు అప్పులు చేసి సినిమాను విడుదల చేసిన సూర్యక్లిష్ట సమయంలో భార్య జ్యోతిక అండగా నిలిచిందని వెల్లడిఅదంతా సూర్య ఔదార్యమేనని చెప్పిన జ్యోతికబాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లు వసూలు చేసిన 'కరుప్పు'స్టార్ హీరో సూర్య తన 'కరుప్పు' సినిమా విడుదల సమయంలో ఎదుర్కొన్న తీవ్ర ఆర్థిక కష్టాల గురించి తాజాగా వెల్లడించారు. సినిమా విడుదలకు చివరి నిమిషంలో అదనపు రుణాలు తీసుకోవాల్సి వచ్చిందని, ఆ క్లిష్ట సమయంలో తన భార్య జ్యోతిక అండగా నిలబడిందని ఆయన తెలిపారు. ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో త్రిషతో కలిసి సూర్య నటించిన 'కరుప్పు' చిత్రం 2026 మే 14న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని ఆర్థిక సమస్యల కారణంగా ఒకరోజు ఆలస్యమైంది. తమిళనాడులో పంపిణీకి సంబంధించిన లావాదేవీలు కొలిక్కి రాకపోవడంతో ఆ రోజు ఉదయం షోలు రద్దయ్యాయి. దీంతో సూర్య స్వయంగా రంగంలోకి దిగి, వ్యక్తిగతంగా భారీ మొత్తం చెల్లించడంతో పాటు అదనపు నిధులు సమకూర్చి మే 15న సినిమాను విడుదల చేశారు. అనేక అడ్డంకులను దాటుకుని విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళు సాధించి సంచలన విజయం నమోదు చేసింది. ఈ నేపథ్యంలో 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య ఆనాటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. "ఈ విషయంలో జ్యోతికకు థ్యాంక్స్ చెప్పాలి. అది చాలా పెద్ద ఆర్థిక భారం. చివరి నిమిషంలో నా మీద పడింది. నేను అదనపు రుణాలు తీసుకుంటున్నప్పుడు ఆమె నాపై నమ్మకం ఉంచింది. ఒకవేళ ఏదైనా తేడా వస్తే, కుటుంబంగా మేమంతా కష్టాలు పడాల్సి వచ్చేది. అయినా ఆమె నా నిర్ణయాన్ని నమ్మింది" అని సూర్య వివరించారు. అయితే, జ్యోతిక మాత్రం ఈ ప్రశంసను స్వీకరించలేదు. "ఈ క్రెడిట్ నేను తీసుకోను. ఇదంతా పూర్తిగా ఆయన కృషే. సినిమాను విజయవంతం చేయాలనే ఆయన ఔదార్యం వల్లే ఇది సాధ్యమైంది" అని ఆమె బదులిచ్చారు. ఈ విజయం వెనుక దర్శకుడు ఆర్‌జే బాలాజీ, ఇతర ఫైనాన్షియర్ల కృషి కూడా ఉందని సూర్య పేర్కొన్నారు.



## వేధించే వారి అకౌంట్లు ట్యాగ్ చేయండి..

# నెటిజన్లకు మృణాల్ ఠాకూర్ పిలుపు

డీప్‌ఫేక్, ఆన్‌లైన్ వేధింపులపై తీవ్రంగా స్పందించిన నటి మృణాల్ ఠాకూర్ వేధించే వారి అకౌంట్ల వివరాలు పంచుకోవాలంటూ నెటిజన్లను కోరిన నటి తన ఫొటోలను దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్, దీపికా పదుకొణేతో 'రాకా' చిత్రంలో నటిస్తున్న మృణాల్ డీప్‌ఫేక్ కంటెంట్‌ను దుర్వినియోగం చేయడంపై ఇటీవలే తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్, ఇప్పుడు ఆన్‌లైన్ వేధింపులపై మరో ముందడుగు వేశారు. సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడే వారిని గుర్తించి, వారి వివరాలను బహిర్గతం చేయాలని నెటిజన్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. ఆన్‌లైన్‌లో ఇతరులను వేధించే, కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో సృష్టించిన లేదా అంగీకారం లేకుండా తీసిన వ్యక్తిగత చిత్రాలను పంచుకునే అకౌంట్ల వివరాలను ట్యాగ్ చేయాలని మృణాల్ కోరారు. "ఇంటర్నెట్‌లోని ఈ మేధావుల కోసం ఓ 'హాల్ ఆఫ్ ఫేమ్' నిర్మిద్దాం. వేధించే ఖాతాలను గుర్తిస్తే, వాటిని ట్యాగ్ చేయండి. ఇలాంటివి డాక్యుమెంట్ చేయడం చాలా అవసరం" అని తన పోస్టులో పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితమే డీప్‌ఫేక్‌పై మృణాల్ తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే. "నా ఫొటోలను ఉపయోగించి డీప్‌ఫేక్ కంటెంట్ సృష్టించడం లేదా పంచుకోవడం చట్టవిరుద్ధం, ఆమోదయోగ్యం కాదు. దీన్ని అధికారిక హెచ్చరికగా భావించండి. నా గుర్తింపును ఇంకెవరైనా దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాను" అని ఆమె స్పష్టం చేశారు. ఇక మృణాల్ కెరీర్ విషయానికొస్తే, ఆమె చివరిగా డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వచ్చిన 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రంలో వరుణ్ ధావన్, పూజా హెగ్డేలతో కలిసి నటించారు. ప్రస్తుతం ఆమె సౌత్ ఇండియాలో ఓ భారీ ప్రాజెక్టులో భాగమయ్యారు. అట్లీ దర్శకత్వంలో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, దీపికా పదుకొణె ప్రధాన పాత్రలలో నటిస్తున్న 'రాకా' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. అల్లు అర్జున్, దీపికా కలిసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం. ఇటీవల విడుదలైన 'రాకా' ఫస్ట్‌లుక్‌లో అల్లు అర్జున్ గుండుతో, తోడేలు పంజా ముఖానికి అడ్డుగా ఉన్న ఇంటెన్స్ లుక్‌లో కనిపించి సినిమాపై అంచనాలను పెంచారు.



## బూతులు మాట్లాడటం 'కూల్' కాదు

# : ఒలింపిక్ విజేత మను బాకర్

యువతలో అనుచిత పదజాల వాడకం సాధారణమైపోవడంపై భారత ఒలింపిక్ షూటింగ్ మెడలిస్ట్ మను బాకర్ ఆందోళన వ్యక్తం చేసింది. "బూతులు మాట్లాడటం కూల్ కాదు" అని స్పష్టం చేస్తూ, ప్రతి ఒక్కరూ తమ మాటలను జాగ్రత్తగా ఎంచుకోవాలని సూచించింది. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా కొందరు అనుచిత నినాదాలు చేసిన నేపథ్యంలో ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ విషయంపై మను బాకర్ ఆదివారం 'ఎక్స్' వేదికగా స్పందించింది. "మనం మాట్లాడే భాషే మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. మన మాటలే కాలక్రమేణా మన నడవడికగా మారతాయి. అందుకే మాటలను జాగ్రత్తగా ఎంచుకోవాలి. బూతులు మాట్లాడటం ఆత్మవిశ్వాసం కాదు, ఆధునికత అంతకన్నా కాదు" అని పేర్కొంది. కష్టపడి పనిచేయడం, దయతో ఉండటం, ఇతరులను, మనల్ని మనం గౌరవించుకోవడం, నిజాయతీగా విజయం సాధించడం, తల్లిదండ్రులు, దేశం



గర్వపడేలా చేయడమే అసలైన 'కూల్' అని ఆమె వివరించింది. గత కొన్నేళ్లుగా యువతలో బూతు భాష వాడకం సాధారణమైపోయిందని, చాలా మంది దాన్ని 'కూల్'గా భావిస్తున్నారని, అందుకే తాను స్పందించాల్సి వచ్చిందని మను బాకర్ స్పష్టం చేసింది. ఈ నిరసనల అనంతరం ప్రధాని మోదీ సైతం స్పందించి, తనను దూషించిన విద్యార్థులను క్షమిస్తున్నానని, సమాజం వారికి మార్గనిర్దేశం చేయాలని కోరిన విషయం తెలిసిందే. వివాదంపై పలువురు ప్రముఖులు స్పందించారు. ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్, నిరసన ద్వారా విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించినా, ప్రధానిని దూషించడం తనను బాధించిందని అన్నారు. "ప్రజాస్వామ్యం మనకు అసమ్మతి తెలిపే హక్కు ఇస్తుంది కానీ, అగౌరవపరిచే హక్కును కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. మరో నటుడు అశుతోష్ రాణా కూడా బాధ్యతాయుతమైన సంభాషణ ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. "సింహాలు గర్జిస్తాయి, కుక్కలు మొరుగుతాయి. వాటి శబ్దాన్ని బట్టే వాటిని గుర్తిస్తారు. మన మాటలే మనకు గౌరవాన్ని లేదా అవమానాన్ని తెచ్చిపెడతాయి" అని అన్నారు. నిరసనకారులను "గట్టర్ జనరేషన్" అని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు.

## అర్ష్‌దీప్‌కు చోటు.. అభిషేక్ శర్మకు నిరాశ..

# దులీప్ ట్రోఫీ నార్త్ జోన్ టీమ్ ఇదే

**దులీప్ ట్రోఫీ కోసం నార్త్ జోన్ జట్టు ప్రకటన**
**జమ్మూ కశ్మీర్ ఆటగాడు కన్హయ్య వాధ్వాన్‌కు కెప్టెన్సీ**
**జట్టులో టీమిండియా పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, అన్షుల్ కంబోజ్**
**పంజాబ్ స్టార్స్ అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్‌లకు నిరాశ**
**శ్రీలంక పర్యటన కారణంగా గిల్, ఆకిబ్ నబీ దూరం**

దేశవాళీ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ-2026 కోసం నార్త్ జోన్ తమ జట్టును ప్రకటించింది. ఆగస్టు 23 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో జట్టు సారథ్య బాధ్యతలను జమ్మూ కశ్మీర్‌కు చెందిన 24 ఏళ్ల వికెట్ కీపర్-బ్యాటర్



కన్హయ్య వాధ్వాన్ చేపట్టనుండగా, ఢిల్లీ ఆటగాడు ఆయుష్ బదోని వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ జట్టులో టీమిండియా పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, అన్షుల్ కంబోజ్‌లకు చోటు కల్పించారు. ఇటీవల రంజీ ట్రోఫీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జమ్మూ కశ్మీర్ జట్టు నుంచి కమ్రాన్ ఇక్బాల్, అబ్దుల్ సమద్, అబిద్ ముస్తాక్, సునీల్ కుమార్, యుద్ధ్వీర్ సింగ్ వంటి పలువురు ఆటగాళ్లను సెలక్టర్లు ఎంపిక చేశారు. దేశవాళీ క్రికెట్‌లో వారు కనబరిచిన ప్రదర్శనకు దక్కిన గుర్తింపుగా దీనిని పేర్కొనవచ్చు. అయితే, పంజాబ్‌కు చెందిన స్టార్ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌లకు ఈ జట్టులో చోటు దక్కలేదు. మరోవైపు, టీమిండియా శ్రీలంక పర్యటన నేపథ్యంలో శుభ్‌మన్ గిల్, ఆకిబ్ నబీలు అందుబాటులో లేరని సెలక్షన్ కమిటీ స్పష్టం చేసింది. సీనియర్ ఆటగాడు పరాస్ డోగ్రా (41) పేరును కూడా సెలక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన కన్హయ్య వాధ్వాన్ తన ఫస్ట్-క్లాస్ కెరీర్‌లో ఇప్పటివరకు 16 మ్యాచ్‌లు ఆడి 883 పరుగులు చేశాడు. అతను 2018-19 సీజన్‌లో కేవలం 17 ఏళ్ల వయసులోనే రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేయడం గమనార్హం.



## టీమిండియాలో షమీకి దారులు

# మూసుకున్నట్టేనా?.. సెలక్టర్ల సందేశం ఇదే!

టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తరచూ గాయాల బారిన పడటం జట్టు యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఆడినప్పటికీ, శ్రీలంకతో జరగబోయే టెస్ట్ సిరీస్‌కు బుమ్రా మరోసారి గాయంతో దూరమయ్యాడు. అతని స్థానంలో జమ్మూ కశ్మీర్ యువ పేసర్ ఆకిబ్ నబీకి బీసీసీఐ అవకాశం కల్పించింది. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన నబీకి చోటు దక్కడంపై హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ, ఈ నిర్ణయం సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ కెరీర్‌పై తీవ్రమైన ప్రశ్నలను రేకెత్తిస్తోంది. గత కొంతకాలంగా షమీ టీమిండియాకు దూరంగా ఉంటున్నాడు. అతను 2023 నుంచి టెస్టులకు, గత ఏడాది నుంచి వన్డేలకు, 2025 నుంచి టీ20లకు ఎంపిక కాలేదు. తొలుత ఫిట్‌నెస్ సమస్యలతో పక్కనపెట్టినా, గత ఏడాదిగా దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నప్పటికీ జాతీయ జట్టులోకి అతనికి పిలుపు అందడం లేదు. షమీ పునరాగమనంపై బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను ప్రశ్నించగా, టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన ఫిట్‌నెస్ అతనికి లేదని స్పష్టం చేశాడు. అయితే, వాస్తవ గణాంకాలు మరోలా ఉన్నాయి. షమీ తన చివరి ఏడు రంజీ ట్రోఫీ మ్యాచ్‌లలో ఏకంగా 1383 బంతులు వేసి, 16.72 సగటుతో 37 వికెట్లు పడగొట్టాడు. ఇందులో మూడుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన, కెరీర్ బెస్ట్ గణాంకాలు (8/90) కూడా ఉన్నాయి. ఇంత శ్రమించినా ఫిట్‌నెస్ లేదనడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు శ్రీలంకతో సిరీస్‌కు ఎంపికైన ఆకిబ్ నబీ రంజీ సీజన్‌లో అద్భుతంగా రాణించాడు. కేవలం 12.56 సగటుతో 60 వికెట్లు తీసి అందరి దృష్టిని ఆకర్షించాడు. అతని ప్రదర్శనకు గుర్తింపు లభించింది. ఈ ఎంపికతో అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ షమీకి, ఇతర సీనియర్ ఆటగాళ్లకు ఒక స్పష్టమైన సందేశం పంపినట్లు కనిపిస్తోంది. కేవలం దేశవాళీలో రాణిస్తే సరిపోదు, జాతీయ జట్టులో చోటు కోసం పోటీ పడుతున్న యువ ఆటగాళ్ల కంటే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, పూర్తి ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సిందే. ఇకపై యువ ఆటగాళ్లు కేవలం జట్టును నింపడానికి కాకుండా, వారి ప్రదర్శన ఆధారంగా నేరుగా తుది జట్టులో స్థానం కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో షమీ తిరిగి జట్టులోకి రావడం మరింత కష్టతరం కానుంది.

# ప్రశ్నాపత్రాల లీకేజీపై ఎవరినైనా విమర్శిస్తాం !

- -ప్రధానమంత్రిని విమర్శిస్తే మీకేందుకంత ఏడుపు వస్తుందో..!
- -నిరుద్యోగ యువతపై విచక్షణారహితంగా దాడులు చేస్తే మీకు పట్టదా..?
- - యువత మీపై పెట్టుకున్న కొద్దిపాటి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అంటే ఇదేనా..!
- -డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తీరుపై ఘాటుగా విమర్శించిన కాంగ్రెస్ సీనియర్ నేత ఎస్.రెడ్డీ సాహెబ్



**మదనపల్లి–సూర్య వాస్తవం:** 2024లో కూటమికి ఓట్లు వేసి, మీరు ఉప ముఖ్య మంత్రి కావడానికి వెన్నంటి నిలిచిన యువత, నిరుద్యోగుల ఆవేదన మీకు పట్టాదా పవన్ కళ్యాణ్ గారు! అంటూ కాంగ్రెస్ పార్టీ మదనపల్లె సీనియర్ నేత ఎస్.రెడ్డీ సాహెబ్ ప్రశ్నించారు. మంగళవారం తమ పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరత్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు ఈశ్వరయ్య, మహమ్మద్ అలి, హబీబ్ లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత పట్ల చిత్తశుద్ధి లేదని, బిజెపి, నరేంద్ర మోదీకి భజన చేస్తున్నారని విమర్శించారు. 23 రోజులు పాటు యువత నిరసనలు వ్యక్తం చేస్తే ఏ రోజు అయిన వారి సమస్యలు తెలుసుకోవడానికి మీరు ప్రయత్నం చేశారా అని సూటిగా ప్రశ్నించారు. నీట్ పేపర్ లీకేజ్ పైన కలత చెందిన విద్యార్థులు 22 మంది తనువు చలిస్తే మీకు పట్టాదా, నిరుద్యోగ యువత తలపెట్టిన నిరసనలో ప్రేరేపిత వ్యక్తులు చొరబడి హింసాత్మకంగా మారి రక్త గాయాల అయ్యేలా దాడులు చేస్తే ఒకమాట కూడా మాట్లాడని పవన్ కళ్యాణ్, ప్రదాన మంత్రి నరేంద్ర మోదీని తిట్టారని ఏడుపు వచ్చిందని బహిరంగ సభలో చెప్పడం యువత, నిరుద్యోగులపై ఆయన వైఖరి ఏమిటో అందరికీ అర్థమైందంటూ విమర్శించారు. పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టక ముందు, పార్టీ పెట్టిన తరువాత చెగొవేర తనకు ఆదర్శం, ఆయన భావజాలం అంటూ చెప్పిన మాటలు మభ్యపెట్టడాని కేనా అని ప్రశ్నించారు.

వేలాది పుస్తకాలు చదవడం, వాటిలోని తత్వాన్ని బహిరంగ పరచడం మాటలకు తప్ప ఆచరణలో శూన్య అని విమర్శించారు. ఒకప్పుడు మీ గురించి చదివితే మీ లాంటి వ్యక్తి రాజకీయల్లోకి రావాలి, మీరు వస్తే దేశం, రాజకీయాలు బాగు పడతాయని అనుకున్నారు. ఇప్పుడు మీరు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం, బిజెపి కి తొత్తుగా వ్యవహా రించడం, యువత పట్ల మీ వైఖరి పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేశారని అన్నారు. ఈ 12 సంవత్సరాలలో 152 సార్లు పేపర్ లీక్ అయితే ఇటీవల లీక్ అయిన నీట్ పేపర్ లీక్‌తో మనస్తాపంతో 22 మంది చనిపోతే మీది, కేంద్రం లోని మీ కూటమి ప్రభుత్వానిది బాధ్యత కాదా అని ప్రశ్నించారు. పరీక్ష పత్రాలు లీక్ పైన జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన విద్యార్థుల ఆందోళనతో అర్ధరాత్రి విడియో ద్వారా ప్రకటన చేసిన ప్రదాన మంత్రి మీకు మంచివాడా, మరి ఇన్ని రోజులు ప్రదాన మంత్రి ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. దేశానికి భావిభారత పౌరులు, భవిష్యత్తు సంపద అయిన యువత గురించి మీరు తక్కువ చేసి చూడటం ఆక్షేపణీయం అన్నారు. ఇప్పటికైన మీ వైఖరిలో మార్పు రావాలని లేనియెడల యువత క్రోధానికి గురికాక తప్పదని సూచించారు.

# చంద్రబాబు పాలనలో గ్రామీణాభివృద్ధికి మహర్దశ

**- రూ.1.93 కోట్లతో నాలుగు సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు ప్రారంభం**
**- రామాపురం, గాలివీడు మండలాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని కొత్త దశలోకి తీసుకెళ్తోందని... గ్రామాల్లో మెరుగైన రహదారులు, తాగునీటి సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా అభివృద్ధి పనులు అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.. మంగళవారం రామాపురం, గాలివీడు మండలాల్లో మొత్తం రూ.1.93 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు.



ఈ సందర్భంగా నాలుగు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు తాగునీటి బోరును ప్రారంభించారు. రామాపురం మండలంలోని పాలన్నగారి పల్లి - చిట్లూరు గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఏకిలపల్లి--చిట్లూరు గ్రామంలో రూ.70 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గాలివీడు మండలంలోని అరవీడు గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక నిధులతో రెండు ప్రధాన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. జీజీ రోడ్డు నుంచి రెడ్డివారి పల్లి వరకు రూ.45 లక్షలతో, అరవీడు కస్పా నుంచి మంగళపల్లి వరకు రూ.48 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే రామాపురం మండలం లోని పక్కీరుపల్లి--చిట్లూరు గ్రామంలో ప్రజలకు స్వచ్ఛ మైన తాగునీరు అందు బాటులోకి తీసుకురావడానికి ఏర్పా టు చేసిన తాగునీటి బోరును మంత్రి ప్రారంభించారు.



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడితే వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు మరింత ఊతం లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షులు, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, గ్రామస్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉప్పలూరు, మాదన్నగారి పల్లెలో పొలం పిలుస్తోంది

**-ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలి**

**ముద్దనూరు – సూర్య వాస్తవం:** మండలంలోని ఉప్పలూరు మరియు మాదన్నగారి పల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎడిఏకె రామ మోహన్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గోని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎడి ఏ కె రామ మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాల న్నారు. ఎలినినో ప్రభావం పంటలపైన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లా డుతూ ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన అన్ని పంటలను తప్ప నిసరిగా పంట నమోదు చేసుకోవాలి అని తెలిపారు. పంట నమోదు కాకపోతే ఏ పథకం లబ్ధి పొందుటకు వీలు కాదు అన్నారు. ఏ పథకం లబ్ధి పొందాలి అన్న పంట నమోదే ప్రామాణికం అన్నారు. పొలం పిలుస్తోంది కార్య క్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో సాగు చేసిన బత్తాయి, ప్రత్తి పంటలను పరిశీలించి తగు సూచనలు




సలహాలు అందించారు. ప్రత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతిని తగ్గించుటకు పసుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 10 చొప్పున ప్రత్తి పంట లో పంట కంటే ఒక అడుగు ఎత్తు పైన ఉండేటట్లు అమర్చుకోవాలి అన్నారు.ఈ విధంగా చేయడం వలన రసం పీల్చే పురుగుల ఉధృతి ని తగ్గించ వచ్చును అన్నారు. బత్తాయి పంటలో సూక్ష్మ పోషకాల లోపం గురించి రైతులకు వివరించారు. అలాగే కంది విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులకు కావలసిన యూరియా మరియు డిఏపి ఎరువులు ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డ్ తీసుకుని ఎపి ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా ఎరువులు పొందవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది ప్రశాంత్ కుమార్, ధరణి,లిల్లీ గ్రేస్, గ్రామ రైతులు సుబ్బారెడ్డి, విజయ భాస్కర్ నాయిడు, రవి శంకర్ నాయిడు, సురేంద్ర నాయిడు తదితర రైతులు పాల్గొన్నారు.



# ఏఎంసి ఛైర్మన్లకు కలియుగ దైవం బ్రేక్ దర్శనాన్ని కల్పించాలి

**విజయవాడ–సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలోని సచివాలయంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కొండా ప్రవీణ్ కుమార్, రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ బోదిరెడ్డి రాంప్రసాదరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లకు ఇస్తున్న బ్రేక్ దర్శన అవకాశం, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్లకు కూడా తిరుమల తిరుపతి దేవస్థానంలో కలియుగదైవం ఏడుకొండలవారి బ్రేక్ దర్శన అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఏఎంసీ చైర్మెన్లు కృతజ్ఞతలు తెలిపారు.

# సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన వేదవ్యాస విద్యార్థులు




**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** యోగి వేమన యూనివర్సిటి డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో శ్రీ వేదవ్యాస డిగ్రీ కాలేజి విద్యార్థిని విద్యార్థినులు యూనివర్సిటి స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ ఎల్. నాగేశ్వర రెడ్డి తెలిపారు. నాల్గవ సెమిస్టర్ బియస్సీ విభాగంలో ఎస్. రేణుక 9.70, టి. మానస 9.70, పి. సుబ్బమ్మ 9.55, ఎ. సుప్రజ 9.40, యు.ఎస్. లైబా 9.35 బి. కామ్ విభాగం లో జి.అనిత 9.80, ఎస్. సబిహా బీ 9.50 ,జి. హారిత 9.50, పి. శివ హర్ష 9.25, మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి.సుదర్శన రెడ్డి, యన్.యస్.యస్ కోఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, యాసిన్ , నాగరాజ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశాలపై అవగాహన సమావేశాలు



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలను అన్నమయ్య జిల్లా ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు రాయచోటి మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలుస, కళాశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 14 సంవత్సరాలు నిండిన వారు, వివిధ కారణాల వల్ల చదువు మధ్యలో నిలిపివేసి ఇంటి వద్ద ఉన్నవారు, చిన్న చిన్న వ్యాపారాలు లేదా చిరు ఉద్యోగాలు చేస్తున్నవారు ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతిలో ప్రవేశం పొందేందుకు అర్హులని తెలిపారు. అలాగే పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మరియు ఒరియా మాధ్య మాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

అనంతరం రాయచోటి మండలంలోని పలు విద్యాసంస్థల్లో అవగాహన సమావేశాలు నిర్వహించి, ఓపెన్ స్కూల్ ప్రవేశాల పెంపునకు అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మండల విద్యాశాఖ అధికారి శ్రీ నాగమునిరెడ్డి, వారి సిబ్బంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీమతి సైరాబాను మరియు వారి సిబ్బంది, జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ షమీర్ భాషా మరియు వారి సిబ్బంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నేతాజీ సర్కిల్ ప్రధానోపాధ్యాయులు మరియు సిబ్బంది, జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల, అలీమాబాద్ ప్రధానోపాధ్యాయిని శ్రీమతి త్రివేణి మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో ఓపెన్ స్కూల్ ప్రవేశాల లక్ష్యాలను విజయవంతంగా సాధించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు, విద్యాశాఖ అధికారులు సమిష్టిగా కృషి చేసి అర్హులైన అభ్యర్థులను గుర్తించి ప్రవేశాలు కల్పించాలని జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- జిల్లా ఎస్పీ పి. జగదీష్
- ఘనంగా పోలీస్ రక్షక్ ప్రీ-ప్రైమరీ స్కూల్ ఫౌండేషన్ డే వేడుకలు
- ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పోలీస్ రక్షక్ స్కూల్ నిర్వహణ
- పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాతలు, సిబ్బందికి సన్మానం



పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ రక్షక్ ప్రీ–ప్రైమరీ స్కూల్ ఫౌండేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** పోలీసు కుటుంబాల పిల్లలకు మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందించడమే జిల్లా పోలీసుశాఖ లక్ష్యమని జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. స్థానిక





కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ, పిల్లల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా, మెరుగైన విద్యా ప్రమాణాలు మరియు సౌకర్యాలతో పోలీస్ రక్షక్ ప్రీ–ప్రైమరీ స్కూల్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యతో పాటు పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా మెరుగ్గా కల్పిస్తున్నామని చెప్పారు. ఆర్డీటీ సంస్థ సహకారంతో విద్యార్థులకు అదనంగా స్పానిష్ భాషను కూడా బోధిస్తున్నామని ఎస్పీ తెలిపారు. చిన్న వయస్సులోనే కొత్త విషయాలు, భాషలను నేర్చుకోవడం ద్వారా పిల్లలకు మంచి భవిష్యత్తుకు బాటలు పడతాయని పేర్కొ న్నారు. చదువుతో పాటు పిల్లలకు ఆటలు, క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. బాల్యం నుంచే విద్యతో పాటు క్రీడలు, ఆటలకు అలవాటు పడేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాతలు, సిబ్బందిని జిల్లా ఎస్పీ పి. జగదీష్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం. నాగభూషణం, ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, డిస్కవరీ అనంతపురం సంస్థ నిర్వాహకులు అనిల్, ఆర్ఐలు పవన్ కుమార్, రాముడు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పిల్లలను ఆశీర్వదించారు.

# జాతీయ క్రీడలలో సత్తా చాటిన సాయితేజ తైక్వాండో అకాడమీ ఛాంపియన్లు

- సౌత్ జోన్ స్థాయిలో అద్భుత విజయం
- 16 బంగారు పథకాలు 8 వెండీ పథకాలు



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి అర్బన్ గుత్తి మున్సి పాలిటీలో సాయితేజ తైక్వాండో అకా డమీ యందు శిక్షణ పొందుతున్న 24 మంది టైక్వాండో క్రీడాకారులు వైపా. దక్షిణ భారతదేశ జోన్ టైక్వాం డో ఛాంపియన్షిప్ 2026కు సంబం ధించి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ తమిళనాడు కర్ణాటక కేరళ రాష్ట్రాలకు చెందిన టైక్వాండో క్రీడలలో గుత్తి సాయి తైక్వాండో అకాడమీ క్రీడాకారులు జాతీయ క్రీడలలో సౌత్ జోన్ స్థాయిలో 16 మంది బంగారు పథకాలు 8 మంది వెండి పథకా లు సాధించారు. సదరు ప్రతిభ కనబ రిచిన క్రీడాకారుల ప్రతిభకు మున్సి పల్ ఆఫీసులో కమిషనర్ బి.జబ్బర్ మియా అభినందనల ప్రశంసలతో సత్కరించారు. వారిని ఉద్దే శిస్తూ క్రీడల యందు పిల్లలు వారికి క్రీడలు యందు ఆసక్తి ఆసక్తి కలిగి చదువుపల చదువుపట్ల మక్కు కలి గిన విద్యార్థులు మంచి స్థాయిలో ఉంటారని కమిషనర్ బి జబ్బర్ మి యా ప్రతి ఒక్కరు క్రీడలతోపాటు చ దువును కూడా సమాన ప్రాతిపదిక న అభ్యసించాలని బాలికలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన పెంచుకోవాలన్నారు బయట ప్రపంచం లో ప్రస్తుత పరిస్థితులలో తెలియని వ్యక్తులు తెలిసిన వ్యక్తులు బాలిక బాలికల పట్ల ప్రవర్తించే ప్రవర్తన మ రియు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ను అ ర్థం చేసుకొని వెంటనే తల్లిదండ్రుల కు వివరించేలా పిల్లలకు ప్రతి స్కూ లు యందు విద్యార్థి దశ నుండి అవ గాహన కల్పించాలని కమిషనర్ బి జబ్బర్ మియా తెలియజేశారు. పిల్ల లను జాతీయ స్థాయి వరకు వారి క్రీ డలను మరియు వారికి క్రీడలలో శి క్షణ ఇచ్చి మెలకువలు నేర్పించి అ వార్డు ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న టైక్వాండో అకాడమీ ని ర్వాహకులు సాయి తేజని కూడా అభినందించారు పిల్లలందరూ కూ డా తమకు విద్య నేర్పించే గురువు లు పట్ల వినయ విధేయతలతో ఉం డడం వలన విద్య మరియు వారి మెలకువలతో మనం జీవితంలో ఎం తో మంచి స్థాయిలో ఉంటామని త ల్లి తండ్రి గురువు దైవం ఇలా ప్రతి విషయంలో చిన్నతనం నుండే పిల్ల లు మంచి అలవాటని అలవర్చుకొ ని వారి తల్లిదండ్రులకు చదువు వి ద్యలు నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భం గా వారిని సత్కరించి ప్రశంసలతో వెళ్ళు వెత్తారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సిబ్బంది సాయి తైక్వాండో నిర్వాహక సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం

**- బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ముని రాజా యాదవ్**



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఇంటింటికి టిడిపి 9వ రోజు శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని ఏర్పేడు మండలం అంజిమేడు,సీతారాంపేట,ఏర్పేడు గ్రామాల నందు విస్తృతంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొడుగుమునిరాజు యాదవ్ మంగళవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలు బలపడితేనే రాష్ట్రం బలపడుతుందనే ఆలోచనతో ముందుకు వెళ్తూ బీసీ కులాలకు తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతున్నదని గుర్తు చేశారు. తెలుగు దేశం ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నద న్నారు ఎన్నికల హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉచిత గ్యాస్ సిలిండర్లు తల్లికి వందనం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు నుంచి విశేష స్పందన లభిస్తున్నదన్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వం పనితీరు అభినందిస్తున్నారు. గ్రామాల్లో ఇంటింటికి తెలుగుదేశం పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు అన్నారు. ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి సంక్షేమానికి ప్రజలు ఆనంద వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతంలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కారానికి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతున్నదన్నారు. సమస్యలను గుర్తించి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారానికి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసే దానికి ఒక సైనికులాగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగరాజు నాయుడు,పార్లమెంట్ మహిళ కార్యదర్శి కృష్ణవేణి, సింగిల్ విండో చైర్మన్ మహేష్ రెడ్డి,టిడిపి సీనియర్ నాయకులు శివశంకర్ రెడ్డి,సూరి నాయుడు, ధనుంజయ నాయుడు, మోహన్ నాయుడు,కేశినేని సుబ్రహ్మణ్యం,గుణ యాదవ్, దేవేందర్ నాయుడు రాచేటి సుబ్రమణ్యం, కేకే రమణ, మునయ్య, బాలాజీ రెడ్డి బాల కుమారస్వామి టిడిపి కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వాడిన వంటనూనెతో బయోడీజిల్..

**- కడపలో 'రూకో'కు శ్రీకారం**





**కడప – సూర్య వాస్తవం:** వాడిన వంటనూనెను తిరిగి ఆహార తయారీలో వినియోగించడం వల్ల ప్రజల ఆరోగ్యా నికి ముప్పు వాటిల్లకుండా, అదే నూనెతో బయోడీజిల్ తయారు చేసే లక్ష్యంతో జ్ఞాపిక ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో 'రూకో' కార్యక్రమాన్ని మంగళవారం కడపలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా వాడిన వంటనూనెను సేకరించి రవాణా చేసే ప్రత్యేక వాహనాలను జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ రామచంద్ర, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాకేష్ చంద్ర, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. తర్వాత నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌ను సందర్శించిన అధికా రులు కిచెన్‌ను తనిఖీ చేసి, వాడిన వంటనూనెను మళ్లీ వినియోగించవద్దని యాజమాన్యానికి సూచించారు. హోటల్‌లో సేకరించిన వాడిన నూనెను జ్ఞాపిక ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధులకు అందజేశారు. ఈ నూనెను సంస్థ ఉచితంగా కాకుండా నగదు చెల్లించి కొనుగోలు చేయడం ద్వారా హోటల్ నిర్వాహకులకు అదనపు ఆదాయం లభిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ రామచంద్ర మాట్లాడుతూ, రూకో ద్వారా సేకరించే వాడిన వంటనూనెను బయోడీజిల్ తయారీకి వినియోగిస్తామని తెలిపారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాకేష్ చంద్ర మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత మాట్లాడుతూ వాడిన వంటనూనెను పదేపదే వినియోగించడం వల్ల క్యాన్సర్ సహా అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార కేంద్రాల నిర్వాహకులు వాడిన నూనెను రూకో సంస్థకు అందించి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు ఆదాయం కూడా పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జ్ఞాపిక ఎంటర్‌ప్రైజెస్ అధినేత సంపత్ అల్లూరి, రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ కార్యదర్శి చిన్నారెడ్డి, జిల్లా హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్, ఫుడ్ సేఫ్టీ సూపరింటెండెంట్ అన్వర్, పలువురు అధికారులు, హోటల్ యజమానులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తక్కువ నీటితో పండించే పంటలను సాగు చేయాలి

**- ముస్తాక్ అహ్మద్**



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలం శ్రీపురం గ్రామంలో పొలం పిలుస్తుంది, ఎల్నినో ప్రభావంపై రైతులకు వ్యవసాయ అధికారులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ సాగునీటి సౌకర్యం లేని పొలాల్లో వరిలాంటి నీరు ఎక్కువగా కావలసిన పంటలకు బదులుగా జొన్న, సజ్జ, పప్పు దినుసులు, కొర్రలు వంటి చిరుధాన్యాలు సాగు చేయాలని రైతులకు సూచించారు.

## ఈ సృష్టిలో అత్యంత శ్రేష్టమైనవి తల్లిపాలు



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని బ్రాహ్మణ వీధి, సుంకలమ్మ వీధి అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సృష్టిలో అత్యంత శ్రేష్టమైనవి తల్లిపాలు అని ఐసీడీఎస్ సూపర్వైజర్ దస్తగిరమ్మ అన్నారు. తల్లి పాలలో లెక్కకు మించి ప్రోటీన్లు ఉంటాయన్నారు. పుట్టిన రోజు నుంచి ఐదేళ్ల వరకు బిడ్డకు తల్లిపా లు తాగించాలన్నారు. డబ్బా పాలు ఎట్టి పరిస్థితుల్లో తాపించకూడదన్నారు.

## పాలీసెట్--2026 స్పాట్ అడ్మిషన్ల తేదీని ఆగస్టు 5 నుంచి ఆగస్టు 10కు వాయిదా

**కదిరి– సూర్య వాస్తవం :** పాలిసెట్‌లో అర్హులైన విద్యార్థిని విద్యార్థులకు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ వారు తెలియజేస్తూ ఎస్వీయూ రీజియన్ ప్రాంతంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేసింది. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి అందిన తాజా సూచనల మేరకు అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు అవసరమైన చర్యలు తీసుకుని, స్పాట్ అడ్మిషన్ల తేదీ మార్పు విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ (=జీఐ), ఉన్నత విద్యాశాఖ, ఎస్వీయూ రీజియన్, తిరుపతి సూచించారు. అందులో భాగంగా అర్హులైన అభ్యర్థులు, సకాలంలో స్పాట్ అడ్మిషన్లు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ అధికారులు వెల్లడించారు.



## గ్రామీణాభివృద్ధి విభాగంలో జాతీయ అవార్డు అందుకున్న రాజన్న ఫౌండేషన్



**తిరుపతి– సూర్య వాస్తవం:** సీఎస్ఆర్ టైమ్స్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని లీ మెరిడియన్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన 13వ జాతీయ కార్పొరేట్ సామాజిక బాధ్యత, పర్యా వరణ, సామాజిక, సుపరిపాలన సదస్సు మరియు అవార్డులు--2026లో గ్రామీణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి (గ్రామాభివృద్ధి) విభాగంలో రాజన్న ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డును అందుకుంది. ఈ అవార్డును రాజన్న ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరీనేని భారతదేశంలోని రొమేనియా రాయబారి సెనా లతీఫ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ మాజీ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి భాస్కర్ ఛటర్జీ చేతుల మీదుగా అందుకున్నారు. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి, గ్రామాల సమగ్ర అభివృద్ధి రంగాల్లో రాజన్న ఫౌండేషన్ చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అమర రాజా గ్రూప్, రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, "గ్రామీణాభివృద్ధి పట్ల మా నిబద్ధతకు ఈ జాతీయ అవార్డు గుర్తింపుగా నిలిచింది. ఈ గౌరవాన్ని మా ఉద్యోగులు, భాగస్వాములు, గ్రామీణ ప్రజలకు అంకితం చేస్తున్నాం. సమగ్ర గ్రామీణాభివృద్ధి ద్వారా 'వికసిత్ భారత్--2047' లక్ష్య సాధనకు రాజన్న ఫౌండేషన్ తన సేవలను మరింత విస్తరిస్తుంది" అని అన్నారు. సమ్మిళిత భారత నిర్మాణంలో బాధ్యతాయుత వ్యాపారాల పాత్ర" అనే అంశంతో నిర్వ హించిన ఈ సదస్సులో వికసిత్ భారత్--2047, ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనకు విశేష కృషి చేస్తున్న సంస్థలను సత్కరించారు.

## వైభవంగా వాసవి అమ్మవారికి శాకాంబరీ దేవి అలంకారం



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండలంలో వెలసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రెసిడెంట్ అయ్యపు వెంకట సురేష్ బాబు వారి కమిటీ సభ్యులు మహిళా మండలి ఆధ్వర్యంలో ఆషాడ మాసం మంగళవారం సందర్భంగా వాసవి అమ్మవారికి అన్ని రకాల కూరగా యలతో ఆకుకూరలతో అత్యంత వైభవోపేతంగా అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా మణులతో కుంకుమార్చన మధ్యాహ్నం అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసారు. ఈ పవిత్రమైన శాఖంబరిదేవి అలంకార దర్శనం ద్వారా సమృద్ధిగా వర్షాలు కురవాలని పంటలు పుష్కలంగా పండాలని ప్రతి ఇంటా సుఖశాంతులు ఆరోగ్యం ఐశ్వర్యం సుభిక్షం నెలకోవాలని అమ్మవారిని అలంకరిస్తారు.

**దర్శనానికి విచ్చేసిన వివిధ ప్రముఖులు**

జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠం పీఠాధిపతులు శ్రీ వీర శివకుమార స్వామి వారు అచలానంద స్వామి ఆశ్రమం పీఠాధి పతులు విరిజానంద స్వాములవారు టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సొసైటీ చైర్మన్ సాంబశివరెడ్డి మండల సీనియర్ నాయకులు ఎస్ఆర్ శ్రీనివాసులురెడ్డి, పలు పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# కర్ణాటక మంత్రుల ప్రమాణస్వీకారోత్సవ చిత్రాలు






















